ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

శుక్రవారం 5 ఏప్రిల్ 2024

నిరుద్యోగులకు నయవంచన

ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ప్రతిపక్ష నేతగా పాదయాత్రలో జగన్ హామీ

- గడిచిన ఐదేళ్లలో ఒక్క ఏడాది కూడా విడుదల చేయని వైసీపీ ప్రభుత్వం
- ఎన్నికలకు ఏడాది ముందు కానిస్టేబుల్, ఎస్ఐ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- ఇప్పటికీ కొలిక్కిరాని కానిస్టేబుల్ పోస్టుల భర్తీ వ్యవహారం
- ఇటీవల హడావిడిగా డీఎస్సీ నోటిఫికేషన్
- కోర్టు అభ్యంతరాలతో వాయిదాపడిన నిర్వహణ
- ఈసారి ఎన్నికల్లో తమ తడాఖా చూపిస్తామంటున్న నిరుద్యోగులు



విశాఖపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి):

'ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీచేస్తాం. నిరుద్యోగులకు అండగా ఉంటాం. ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 26 వేలకుపైగా పోస్టులను అధికారంలోకి వచ్చిన వెంటనే భర్తీచేస్తాం'

- ఇదీ ప్రతిపక్షంలో ఉండగా పాదయాత్ర సమయంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిరుద్యోగులకు ఇచ్చిన హామీ.





మోసం గురూ!

అధికారంలోకి వచ్చి ఐదేళ్లు గడిచిపోయింది. కానీ, జగన్మోహన్‌రెడ్డి నిరుద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేకపోయారు. ఐదేళ్లలో ఒక్కసారి కూడా జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదు. ఒక్క ఉపాధ్యాయ పోస్టును కూడా భర్తీచేయలేదు. పోలీస్ శాఖలోనూ వందలాది ఖాళీలు ఉన్నాయి. ఎన్నికలకు ఏడాది ముందు నోటిఫికేషన్ ఇచ్చినా రిక్రూట్‌మెంట్ ప్రక్రియను నెలల తరబడి సాగదీసింది. ఇప్పటికీ కానిస్టేబుల్ నియామక ప్రక్రియ పూర్తికాకపోవడంతో వేలాది మంది నిరుద్యోగులు నిరాశానిస్పృహల్లో ఉన్నారు. ఇక ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ఎదురుచూస్తున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోనే సుమారు ఐదు లక్షల మంది వరకు అభ్యర్థులు ఉన్నారు. వీరంతా గడిచిన ఐదేళ్ల నుంచి డీఎస్సీ నోటిఫికేషన్ కోసం కళ్లు కాయలుకాసేలా ఎదురుచూస్తున్నారు. మంత్రులు ఇదిగో...అదిగో అంటూ ప్రకటనలతో కాలం వెళ్లదీశారే తప్ప...ఒక్క ఉపాధ్యాయ పోస్టును భర్తీ చేయలేదు. మెగా డీఎస్సీ విడుదల చేస్తామంటూ అనేకసార్లు విద్యా శాఖ మంత్రి ఆర్భాటపు ప్రకటనలు చేశారు. కానీ, నామమాత్రపు పోస్టులతో ఎన్నికలకు కొద్దిరోజులు ముందు డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. టెట్, డీఎస్సీకి తక్కువ సమయం ఇవ్వడం, సిలబస్ ఎక్కువగా ఉండడంతో అభ్యర్థులు ఆందోళనకు గురయ్యారు. దీనిపై కొందరు కోర్టును ఆశ్రయించడంతో టెట్‌కు డీఎస్సీకి తగిన వ్యవధి ఉండేలా చూడాలని ఆదేశించింది. ఈలోగా ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో వైసీపీ ప్రభుత్వం విడుదల చేసిన ఏకైక డీఎస్సీ నోటిఫికేషన్ కూడా నిలిచిపోయినట్టు అయింది. ఇక ఉన్నత పాఠశాలల్లో సమీపంలో గల (మూడు కిలోమీటర్ల పరిధి) ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను విలీనం చేయాలని వైసీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఉపాధ్యాయ పోస్టులు కూడా బాగా తగ్గిపోయాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒక్క ఉపాధ్యాయ, పోలీస్ పోస్టును భర్తీచేయకుండా ఐదేళ్లు పూర్తిచేసిన ఏకైక ప్రభుత్వంగా..జగన్ సర్కారు నిలిచిపోతుందని నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

లక్షల్లో నిరుద్యోగులు

ఉమ్మడి విశాఖ జిల్లాలో లక్షలాది మంది నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవుతున్నారు. దాదాపు ... మిగతా 8వ పేజీలో

నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం

- ఎస్.ఆనంద్



వైసీపీ ప్రభుత్వంలో గతంలో ఎన్నడూ లేని విధంగా నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగింది. గడిచిన ఆరేళ్లుగా కానిస్టేబుల్ పోస్టు కోసం సిద్ధమవుతున్నా. ఎన్నికలకు ఏడాది ముందు నోటిఫికేషన్ ఇచ్చిన ఈ ప్రభుత్వం ఇప్పటికీ నియామక ప్రక్రియను పూర్తి చేయలేకపోయింది. ప్రిలిమినరీ పరీక్షల తరువాత తదుపరి దశ కోసం వేలాది మంది నిరీక్షిస్తున్నారు. ఈ శిక్షణ కోసం ఈ ఆరేళ్లలో సుమారు ఐదు లక్షల రూపాయలకు పైగా ఖర్చయ్యింది. ఉద్యోగం వస్తే ఆనందంగా ఇంటికి వెళ్లాలని భావించాను. కానీ నియామక ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోవడంతో ముఖం చెల్లడం లేదు. ఎంతో ఆశ పెట్టుకున్న తల్లిదండ్రులకు ఏం చెప్పాలో తెలియడం లేదు. ఆరేళ్ల సమయం, లక్షలాది రూపాయల డబ్బు ఖర్చు తప్పితే ఫలితం లేకుండా పోయింది.

నట్టేటముంచేశారు

- కేజే రావు



నిరుద్యోగులను ఈ ప్రభుత్వం నట్టేట ముంచింది. అధికారంలోకి వచ్చిన వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పిన జగన్...మమ్మల్ని మోసం చేశారు. ఈ ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా విడుదల చేయలేదు. ప్రతిపక్షంలో ఉండగా విద్యాశాఖలో సుమారు 26 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పిన ఆయన...అధికారం చేపట్టిన తరువాత ఆ పోస్టుల ఊసే ఎత్తలేదు. డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తారనే ఆశతో అవనిగడ్డలో శిక్షణ పొందాను. సుమారు నాలుగు లక్షల రూపాయలు ఖర్చయింది. తల్లిదండ్రులకు అప్పులు తప్ప మరేమీ మిగలలేదు. ఎన్నికలకు ముందు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చినా...సిలబస్ ఎక్కువ, సమయం తక్కువ ఉండే విధంగా చేసి ఇబ్బంది పెట్టాలని చూశారు. కోర్టుకు వెళ్లి డీఎస్సీ నిలుపు చేయడం వల్ల మాకు మేలు జరిగింది.

ఎన్నికలు సజావుగా జరిగేలా పక్కా ప్రణాళిక

అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

- కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఫిర్యాదుల స్వీకరణ
- అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై నిరంతర నిఘా
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లు, ప్రణాళికను ఆయన గురువారం విలేకరుల సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నియమావళిని తూచా తప్పకుండా పాటిస్తామన్నారు. 1,529 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన పనులు నూరు శాతం పూర్తయ్యాయని చెప్పారు. తుది ఓటర్ల జాబితాలో ఓట్ల నమోదు, చేర్పులు, మార్పుల ప్రక్రియ పూర్తి పారదర్శకంగా చేస్తున్నామన్నారు. కొత్త ఓటర్ల చేర్పులకు ఈ నెల 15వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. ఇప్పటికే చేర్పులు, మార్పుల కోసం అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులతో ఒకటికి రెండు సార్లు చర్చించిన తరువాతే ఓటర్ల జాబితాల్లో మార్పులు, చేర్పులు జరపాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని వెల్లడించారు.

అనకాపల్లిలోనే ఓట్ల లెక్కింపు

అనకాపల్లిలో శంకరం గ్రామంలో జిల్లా పోలీసు కార్యాలయానికి ఆనుకొని వున్న భవనంలోనే ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన చెప్పారు. జిల్లాలో 6 అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు, పార్లమెంట్‌కు సంబంధించి 7 (పెందుర్తితో కలిపి) నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఇక్కడే జరుగుతుందన్నారు. ప్రతి కేంద్రంలో 14 టేబుళ్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ ఏర్పాటు

కలెక్టర్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి నిబంధనల ఉల్లంఘనలపై ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. సి-విజిల్ మొబైల్ యాప్ ద్వారా పౌరులు ఫిర్యాదులు చేయవచ్చునని చెప్పారు. ఆర్వోలకు నేరుగా అందిన ఫిర్యాదులు, దినపత్రికలలో వచ్చిన ప్రతికూల వార్తలకు సంబంధించి ఫిర్యాదులను వెంటనే పరిశీలించి తగిన చర్యలు చేపడుతున్నామని ఆయన వెల్లడించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఎన్నికలకు సంబంధించి 24 గంటలూ ఫిర్యాదులు స్వీకరించే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో టోల్ ఫ్రీ నంబర్ 1950, ల్యాండ్ లైన్ ఫోన్ నంబర్: 08924-226599 లకు ఫోన్ చేసి ఎన్నికలకు సంబంధిచిన ఫిర్యాదులు చేయవచ్చునని తెలిపారు.

అభ్యర్థుల ప్రకటనలు, ఖర్చులపై నిఘా

ఎన్నికల్లో పోటీచేసే పార్టీలు, అభ్యర్థుల ఖర్చులపై నిఘా కొనసాగుతుందని ఆయన చెప్పారు. ఎంపీ స్థానానికి పోటీ చేసే అభ్యర్థి రూ.95 లక్షలు, అసెంబ్లీకి పోటీచేసే అభ్యర్థి రూ.40 లక్షలు వరకు మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంటుంది. నామినేషన్ తేదీ నుంచి ఫలితాలు వెల్లడించే రోజు వరకు చేసిన ఖర్చు మొత్తాలకు ... మిగతా 8వ పేజీలో

మౌనానికి కారణమేంటో ?

టీడీపీ, వైసీపీలోని ఇద్దరు కీలక నేతలు ప్రచారానికి దూరం

- టీడీపీ ప్రచారంలో కనిపించని మాజీ ఎమ్మెల్యే ముత్యాలపాప
- వైసీపీలో చింతకాయల సన్యాసిపాత్రుడుదీ అదే తీరు
- నియోజకవర్గంలో జోరుగా చర్చ



ముత్యాలపాప



చింతకాయల సన్యాసిపాత్రుడు

నర్సీపట్నం, ఏప్రిల్ 4:

నర్సీపట్నంలో ప్రధాన పార్టీల ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. అధికారాన్ని నిలబెట్టుకోవడానికి ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్, అధికారంలోకి రావడానికి మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు తమదైన శైలిలో ప్రచారంలో దూసుకుపోతున్నారు. అయితే ఈ రెండు పార్టీలు ఇద్దరు కీలక నేతలను ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంచడంపై నియోజకవర్గంలో చర్చ సాగుతోంది.

ప్రచారానికి దూరంగా ముత్యాలపాప

బోళెం ముత్యాలపాప 2009లో కాంగ్రెస్ పార్టీ నుంచి నర్సీపట్నం ఎమ్మెల్యేగా గెలుపొందారు. రాష్ట్ర విభజన తరువాత కాంగ్రెస్ పార్టీని వీడి వైసీపీలో చేరారు. 2014లో జరిగిన మండల పరిషత్ ఎన్నికల్లో ఎంపీటీసీ సీట్ల విషయంలో ఆమె కుటుంబానికి పెట్ల గణేశ్ ప్రాధాన్యం ఇవ్వలేదు. దీంతో 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ముత్యాలపాప, ఆమె భర్త వెంకటరమణమూర్తి, మరిది రాంప్రసాద్ వైసీపీకి ప్రచారం చేయకుండా నిశ్శబ్దంగా ఉండిపోయారు. ఈ ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీ చేసిన పెట్ల గణేశ్_ తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత అయ్యన్నపాత్రుడు చేతిలో ఓడి పోయారు. తరువాత వైసీపీకి, బోళెం కుటుంబానికి మధ్య దూరం పెరుగుతూ వచ్చింది. వైసీపీ ఓటమికి బోళెం కుటుంబమే కారణమని, తెరవెనక టీడీపీ విజయానికి పని చేశారని ఎమ్మెల్యే వర్గీయులు ప్రచారం చేశారు. తరువాత 2019 ఎన్నికల్లో బోళెం కుటుంబం టీడీపీలో చేరింది. ఆ ఎన్నికల్లో టీడీపీకి ప్రచారం చేశారు. ఈ ఎన్నికలలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఓటమి చెందారు. ఆ తరువాత టీడీపీలో ముత్యాలపాప కుటుంబం పెద్దగా యాక్టివ్‌గా లేదు. తాజాగా తెలుగుదేశం పార్టీని వీడతారని విస్తృత ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో గత నెలలో బోళెం ముత్యాలపాప, ఆమె భర్త వెంకటరమణమూర్తి, మరిది రాంప్రసాద్‌లను చింతకాయల అయ్యన్నపాత్రుడు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు వద్దకు తీసుకు వెళ్లారు. కాగా 2024 ఎన్నికల్లో ఆ కుటుంబం టీడీపీ విజయానికి పని చేస్తారని అందరూ భావించారు. కానీ వారు ప్రచారంలో కనిపించడం లేదు.

ప్రచారంలో కనిపించని జమీలు

వైసీపీలో ఉన్న చింతకాయల సన్యాసిపాత్రుడు (జమీలు) ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం లేదు. ఆయనే పార్టీకి దూరంగా ఉంటున్నారా?, ఎమ్మెల్యే గణేశ్ కావాలని జమీలును దూరం ... మిగతా 8వ పేజీలో



బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ సమక్షంలో ఆ పార్టీలో చేరిన పరుచూరి భాస్కరరావు

పరుచూరి భాస్కరరావు బీజేపీలో చేరిక

కొత్తూరు, ఏప్రిల్ 4: బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ సమక్షంలో పరుచూరి భాస్కరరావు ఆ పార్టీలో చేరారు. అనకాపల్లిలోని ఆ పార్టీ కార్యాలయంలో భాస్కరరావుతో పాటు పలువురికి సీఎం రమేష్ పార్టీ కండువా చేసి బీజేపీలోకి ఆహ్వానించారు. జనసేనలో టికెట్ రాలేదని పరిచూరి భాస్కరరావు ఆ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. కాగా బీజేపీలో చేరిన అనంతరం భాస్కరరావు మాట్లాడుతూ సీఎం రమేష్ గెలుపునకు కృషి చేస్తానని చెప్పారు.

గల్లీ నుంచి ఢిల్లీకి!

పెందుర్తి నేతల ప్రస్థానం

- రాజకీయ దిగ్గజాలుగా నిలిచిన పలువురు నాయకులు
- సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ద్రోణం, అప్పలనాయుడు
- రాజకీయ గురువుగా గుర్తింపుపొందిన ద్రోణంరాజు సత్యనారాయణ

- 7లో

చోడవరంలో ఉద్రిక్తత

టైల్స్ దుకాణంపై స్టేట్ జీఎస్టీ అధికారులు దాడులు

- ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి కరణం ధర్మశ్రీయే చేయించారని యజమాని ఆరోపణ
- టీడీపీ, జనసేన బీజేపీ కార్యకర్తల నిరసన
- దాడులను నిరసిస్తూ అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ ఆందోళన
- నోటీసులు ఇవ్వకుండా సోదాలు ఏమిటంటూ నిలదీత
- ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామంటూ హెచ్చరిక
- వెనుతిరిగిన అధికారులు



టైల్స్ దుకాణంలో జీఎస్టీ అధికారుల తీరును నిలదీస్తున్న సీఎం రమేష్, పక్కన మాజీ ఎమ్మెల్యే రాజు

చోడవరం, ఏప్రిల్ 4:

అనకాపల్లి జిల్లా చోడవరం పట్టణంలోని గాంధీ గ్రామంలో బుచ్చిబాబు అనే వ్యాపారికి చెందిన టైల్స్ దుకాణంపై స్టేట్ జీఎస్టీ అధికారులు గురువారం దాడులకు దిగడం వివాదాస్పదమైంది. తనపై కక్షతో అధికారులను వైసీపీ అభ్యర్థి, శాసనసభ్యుడు కరణం ధర్మశ్రీ దాడులకు ఉసిగొల్పారని ఆరోపిస్తూ టైల్స్ వ్యాపారి బుచ్చిబాబు, ఆయన కుటుంబీకులు ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలిసి అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, చోడవరం టీడీపీ అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజులు టైల్స్ దుకాణం వద్దకు చేరుకున్నారు. వైసీపీ నేతల ప్రోద్బలంతో దాడులకు పాల్పడడం ఏమిటంటూ సీఎం రమేష్ ప్రశ్నించారు. ఒకపక్క ఎన్నికల కోడ్ అమలులో ఉండగా, వైసీపీ నేతలకు మద్దతుగా నిలవని వారిపై ఈ విధంగా దాడులకు దిగడం ఏమిటంటా నిలదీశారు. అసలు తనిఖీలకు సంబంధించి నోటీసులు ఇవ్వకుండా, భయభ్రాంతులకు గురిచేయడం, రికార్డులు సీజ్ చేయడానికి యత్నించడమేమిటంటూ ప్రశ్నించారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. సీఎం రమేష్ ప్రశ్నలకు జీఎస్టీ అధికారులు నీళ్లు నమలడంతో పాటు సరైన సమాధానం ఇవ్వలేక అక్కడ నుంచి నిష్క్రమించారు. అధికారుల దాడికి నిరసనగా టీడీపీ, జనసేన కార్యకర్తలు ఆందోళనకు దిగడంతో, స్థానిక పోలీసులు దుకాణం వద్దకు చేరుకున్నారు.

ఉదయం నుంచి దాడులు

కాగా బుచ్చిబాబు టైల్స్ దుకాణంలో గురువారం ఉదయం నుంచి జీఎస్టీ అధికారులు గోప్యంగా సోదాలు నిర్వహించారు. నలుగురు అధికారులతో కూడిన బృందం... బుచ్చిబాబు దుకాణంలోని సీసీ కెమెరాలు ఆపివేయించి, సిబ్బంది నుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రికార్డులు తనిఖీ చేయడం విశేషం.

వైసీపీ నేతల అక్రమాలకు ఈ దాడులు పరాకాష్ట: సీఎం రమేష్

అధికారులను పావుగా ఉపయోగించుకుని వ్యాపారులను వైసీపీ నేతలు భయభ్రాంతులకు గురిచేసేందుకు యత్నించడం సిగ్గుచేటని ... మిగతా 8వ పేజీలో

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు

- నర్సీపట్నం రూరల్ ప్రాంతంలో 131 మంది..
- నర్సీపట్నం మునిసిపాలిటీలో 65..
- దేవరాపల్లి మండలం బి.కింతాడలో 13 మంది..



నర్సీపట్నంలో ఎంపీడీవో జాన్ లింకన్‌కు రాజీనామా పత్రాలు అందిస్తున్న వలంటీర్లు

నర్సీపట్నం అర్బన్, ఏప్రిల్ 4:

నర్సీపట్నం మండలం రూరల్ ప్రాంతానికి చెందిన 131 మంది వలంటీర్లు గురువారం మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. మండలంలోని రూరల్ ప్రాంతానికి చెందిన తొమ్మిది సచివాలయాల్లో ఇప్పటి వరకు 155 మంది వలంటీర్లు విధులు నిర్వహిస్తున్నారు. కాగా 131 మంది తమ వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామాలు చేస్తున్నట్టు పేర్కొంటూ రాజీనామా పత్రాలను ఎంపీడీవో జాన్ లింకన్‌కు అందజేశారు. వారి రాజీనామాలను ఆమోదిస్తూ ... మిగతా 8వ పేజీలో

ఘోరం

పెందుర్తి సమీపాన రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొన్న మినీ వ్యాన్



ప్రమాదానికి గురైన మినీ వ్యాన్

- ముగ్గురి మృతి, ఏడుగురికి తీవ్రగాయాలు
- మృతుల్లో తండ్రి,కొడుకు
- పెళ్లి వేడుక నుంచి వస్తుండగా విషాదం

- 7లో

జిల్లాలో 85.05 శాతం పింఛన్ల పంపిణీ

అనకాపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి):

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో సామాజిక భద్రత పింఛన్లు గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా రెండు రోజులుగా పంపిణీ చేస్తున్నారు. గురువారం నాటికి 85.05 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేశారు. జిల్లాలో 522 గ్రామ సచివాలయాల పరిధిలోని వీఆర్‌వో, గ్రామ కార్యదర్శి ఆధ్వర్యంలో సచివాలయంలో పనిచేసే వివిధ హోదాలు కలిగిన ఉద్యోగులు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. 24 మండలాల పరిధిలో 2,66,208 మందికి సామాజిక భద్రతా పింఛన్లు ఇవ్వాల్సి ఉండగా, గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి 2,26,422 మందికి (85.05 శాతం) పింఛన్లు అందజేశారు. వీల్‌ఛైర్‌కి పరిమితమైన వారికి, సైనిక్ వెల్ఫేర్ పింఛన్లు పొందుతున్న వృద్ధ వితంతువులు, కదల్లేని పరిస్థితిలో అనారోగ్యంతో ఉన్నవారు, దివ్యాంగులకు సచివాలయ సిబ్బంది ఇంటికి వెళ్లి పింఛన్ అందిస్తున్నారని డీఆర్‌డీఏ పీడీ శశీదేవి తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందించి నూరుశాతం లక్ష్యాన్ని సాధిస్తామని ఆమె తెలిపారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్ర)	6.14
సహరి (శని)	4.34

క్రైం... crime news

యువతి అదృశ్యంపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 4: యువతి అదృశ్యమైన సంఘటనపై బుధవారం రాత్రి అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్‌ఐ పీవీ రమణ గురువారం తెలిపారు. తుమ్మపాలకు చెందిన 18 ఏళ్ల యువతి ఇంటర్ పూర్తి చేసి ఇంట్లోనే ఉంటుందన్నారు. ఈ నెల రెండో తేదీన ఉదయం తొమ్మిది గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి తిరిగి రాలేదని, ఎక్కడా గాలించినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి సన్యాసిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

12 బాటిళ్లతో వ్యక్తిపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 4: స్థానిక మెయిన్‌రోడ్డులోని సత్తెమ్మతల్లి ఆలయ ముఖద్వారం వద్ద ఒక వ్యక్తి నుంచి గురువారం 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ బి.రామకృష్ణ తెలిపారు. గవరపాలెం పీవీజేఆర్ వీధికి చెందిన మళ్ల తులసీరావు ప్రభుత్వ మద్యం షాపులో మద్యం కొనుగోలు చేసి సంచితో పట్టుకుని వెళ్తుండగా 12 క్వార్టర్ బాటిళ్లను పట్టుకున్నామని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

తండ్రి, కొడుకులపై ఛీటింగ్ కేసు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 4: ఉద్యోగం ఇప్పిస్తానని నకిలీ ధ్రువపత్రం ఇచ్చి రూ. 8.12 లక్షలు తీసుకున్న తండ్రి, కొడుకులపై యర్రంశెట్టి లక్ష్మీకాంత్ అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ జి.శంకరరావు తెలిపారు. ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక శ్రీరామనగర్‌కాలనీకి చెందిన యర్రంశెట్టి లక్ష్మీకాంత్ తండ్రి వద్ద ఉంటుంది. వీరికి దగ్గర బంధువులైన విశాఖనగర వాసులు యర్రంశెట్టి సింహాచలం, ఇతని కుమారుడు శ్రీనివాస్ కార్తీక్ విశాఖ కలెక్టరేట్‌లో కంప్యూటర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికారు. ఈ ఏడాది జనవరి 12న విశాఖ కలెక్టర్ ఆఫీస్‌కు రమ్మని నకిలీ ధ్రువపత్రం ఇచ్చారు. అప్పటి నుంచి తండ్రి, కొడుకులకు దఫదఫాలుగా ఎనిమిది లక్షల 12వేల రూపాయలు ఇచ్చారు. తీరా ఉద్యోగం ధ్రువపత్రం నిజం కాదని గ్రహించిన లక్ష్మీకాంత్ తాను ఇచ్చిన డబ్బులు ఇవ్వాలని కోరినప్పటికీ ఇవ్వకపోవడంతో తండ్రి, కొడుకులపై లక్ష్మీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ శంకరరావు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు : ఇద్దరికి గాయాలు

ఎలమంచిలి, ఏప్రిల్ 4: మండలంలోని లక్కవరం సమీపంలో జాతీయ రహదారిపై గురువారం ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో ఎలమంచిలి సీహెచ్‌సీకి తరలించారు. ఎలమంచిలికి చెందిన కె.అప్పలరాజు, బైక్ మెకానిక్ దండులు ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయానికి వెళుతుండగా ఎలమంచిలి నుంచి తుని వైపు వెళుతున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్టు క్షతగాత్రులు తెలిపారు.

ఐదు లీటర్ల సారాతో ఒకరి అరెస్టు

కశింకోట, ఏప్రిల్ 4: కశింకోట శివారు వెదురుపర్తి గ్రామానికి వెళ్లే దారిలో ఐదు లీటర్ల సారా తరలిస్తున్న వ్యక్తిని గురువారం అరెస్టు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ సూర్యారావు తెలిపారు. ఆ ప్రాంతంలో సాధారణ తనిఖీలు చేస్తుండగా ఏపీ రమణ అనే వ్యక్తి పాల క్యానులో సారాను తీసుకువస్తుండగా పట్టుబడ్డారన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ చెప్పారు.

నాలుగు మద్యం ఫుల్ బాటిళ్లు స్వాధీనం

పరవాడ, ఏప్రిల్ 4 : మండలంలోని కలపాక గ్రామానికి చెందిన బి.నాగలక్ష్మి పరవాడ ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి గురువారం రాత్రి నాలుగు మద్యం ఫుల్ బాటిళ్లను కొనుగోలు చేసి తీసుకువెళ్తుండగా ఎస్‌ఐ మల్లేశ్వరరావు పట్టుకున్నారు. ఆమెపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

జీపు, ద్విచక్రవాహనం ఢీ : ఒకరికి తీవ్రగాయాలు

అరకులోయ, ఏప్రిల్ 4 : శృంగవరపుకోట-అరకులోయ ప్రధాన రహదారిలో సుంకరిమెట్ట వద్ద ఎదురెదురుగా వస్తున్న జీపు, ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి. గురువారం రాత్రి విశాఖపట్నం మర్రిపాలెంకి చెందిన ఆచంట కృష్ణ ద్విచక్రవాహనంపై అరకులోయ నుంచి విశాఖపట్నం వెళుతున్నాడు. అదే సమయంలో శృంగవరపుకోట నుంచి అరకులోయకు వస్తున్న జీపు సుంకరిమెట్ట వద్ద ఢీకొన్నాయి. ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న కృష్ణ తలకు బలమైన గాయమైంది. గాయపడిన వ్యక్తిని 108లో విశాఖపట్నం కేజీహెచ్‌కి తరలించారు. ఈఘటనపై అరకులోయ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

25 మద్యం బాటిళ్లతో ఇద్దరి అరెస్టు

చోడవరం, ఏప్రిల్ 4: పట్టణంలోని ఒక రెస్టారెంట్ సమీపంలో గురువారం వాహనాల తనిఖీ సందర్భంగా ద్విచక్ర వాహనంపై 9 మద్యం బాటిళ్లను తీసుకువెళుతున్న కల్లేపల్లి శ్రీనివాసరావు(50)ను అరెస్టు చేసినట్టు సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. అలాగే గజపతినగరం వద్ద 19 మద్యం బాటిళ్లతో గోవాడ గ్రామానికి చెందిన యాగిరెడ్డి నారాయణరావు(38)ను అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు. వాహనాన్ని సీజ్ చేయడంతోపాటు, నిందితులను రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు.

పాము కాటుకు బాలిక మృతి?

రావికమతం, ఏప్రిల్ 4: పాఠశాల ఆవరణలో ఆడుకుంటుండగా పాము గానీ, విషపురుగు గానీ కరవడంతో బాలిక మృతి చెందిన ఘటన మండలంలో చినపాచిలలో గురువారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని చినపాచిలికి చెందిన పరవాడ ఈశ్వరరావు, మణిలకు రేవతి, బాలశిరీష కుమార్తెలు. తల్లిదండ్రులు పనుల కోసం తూర్పుగోదావరి జిల్లా కడియం వెళ్లారు. వారితోపాటు చిన్న పాపబాలశిరీషను తీసుకువెళ్లారు. పెద్ద పాప రేవతిని నాన్నమ్మ రాజులమ్మ వద్ద ఉంచారు. పరవాడ రేవతి(13) చినపాచిలి పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. ఒంటిపూట బడులు కావడతో బుధవారం మధ్యాహ్నం పాఠశాల ముగిసిన తర్వాత రేవతి ఇంటికి వెళ్లిపోయింది. సాయంత్రం పాఠశాల ఆవరణలో సహచర బాలికలతో రేవతి ఆడుతుండగా పాము గానీ, విష పురుగు గానీ కరిచింది. అయితే ఏదో ముళ్ల కంచె తగిలి రక్తం వస్తుందేమోనని బాలిక ఇంటికి వెళ్లిన తర్వాత నాన్నమ్మకి చెప్పలేదు. గురువారం ఉదయం లేచేసరికి కాలు బాగా వాపు రావడంతో బాలిక రేవతిని నాన్నమ్మ ప్రశ్నించి ఏమైందని అడిగింది. దీంతో ఆమె నిన్న సాయంత్రం పాఠశాల వద్ద ఆడుకుంటుండగా ఏదో తగిలి రక్తం వచ్చిందని, నీకు చెబితే మందలిస్తావని చెప్పలేదని తెలిపింది. దీంతో రాజులమ్మ వెంటనే మనవరాలు రేవతిని రావికమతం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందింది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. గ్రామంలో బాలికకు అంత్యక్రియలు జరిగాయి.

10న విశాఖ, కిరండోల్ రైలు రద్దు

విశాఖపట్నం, ఏప్రిల్ 4: బొర్రాగుహలు, కరకవలస స్టేషన్ల మధ్య బ్రిడ్జి పునర్నిర్మాణ పనులు చేపడుతున్న నేపథ్యంలో విశాఖ, కిరండోల్ మధ్య రాకపోకలు సాగించే 08551, 08552 నంబర్లు గల రైళ్లను ఈనెల 10వతేదీన రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు.

విశాఖ, కిరండోల్ రైలుకు అదనపు థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్

అరకు నుంచి జగదల్‌పూర్ వెళ్లే ప్రయాణికుల డిమాండ్ మేరకు విశాఖ, కిరండోల్ మధ్య నడిచే 08551, 08552 నంబర్లు గల రైళ్లకు మూడు నెలలపాటు తాత్కాలిక అదనపు థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌ను జత చేస్తున్నామని త్రిపాఠి తెలిపారు. విశాఖ నుంచి కిరండోల్ వెళ్లే 08551 నంబరు గల రైలుకు ఈనెల 8 నుంచి జూన్ 30 వరకు, తిరుగు ప్రయాణంలో కిరండోల్ నుంచి విశాఖ వచ్చే 08552 నంబరు గల రైలుకు ఈనెల 9 నుంచి జూలై ఒకటి వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	115.00
లైవ్ ధర	135.00
విత్ స్కిన్	240.00
స్కిన్ లెస్	250.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

గల్లీ నుంచి ఢిల్లీకి!




ద్రోణంరాజు సత్యనారాయణ


ఎస్‌ఆర్‌ఏఎస్ అప్పలనాయుడు

పెందుర్తి నేతల ప్రస్థానం

- రాజకీయ దిగ్గజాలుగా నిలిచిన పలువురు నాయకులు
- సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ద్రోణం, అప్పలనాయుడు, అదీప్‌రాజ్
- రాజకీయ గురువుగా గుర్తింపుపొందిన ద్రోణంరాజు సత్యనారాయణ

పెందుర్తి, ఏప్రిల్ 4:

పెందుర్తి శాసనసభ నియోజకవర్గానికి అనేక విశిష్టతలున్నాయి. ఇక్కడి నుంచి ఢిల్లీ స్థాయిలో ఎదిగిన నేతలు జిల్లాతో పాటు రాష్ట్ర రాజకీయాలను శాసించారు. అంతేకాదు... ఇక్కడ రాజకీయ ఓనమాలు దిద్దిన వారిలో చాలామంది గతంలోనూ, ప్రస్తుతం కీలక పదవులు అలంకరించారు. రానున్న సాధారణ ఎన్నికల్లోనూ సత్తా చాటేందుకు ఉవ్విళ్లూరుతున్నారు.

రాజకీయ పురుటిగెడ్డగా పేరున్న పెందుర్తి నియోజకవర్గంలో సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన వారు ఢిల్లీ వరకు ఎదిగారు. వీరిలో దివంగత ద్రోణంరాజు సత్యనారాయణ, ఎస్‌ఆర్‌ఏఎస్ అప్పలనాయుడు దిగ్గజ నేతలుగా గుర్తింపును సాధించారు. ద్రోణం కరణంగా, ఎస్‌ఆర్‌ఏఎస్ మునసబుగా పనిచేశారు, వీరిదద్దరి రాజకీయ అరంగేట్రం సర్పంచులుగానే ప్రారంభమయింది. అక్కడి నుంచి ఒక్కసారిగా ఎమ్మెల్యే, ఎంపీ పదవులు పొందారు. కాగా రాంపురం సర్పంచ్‌గా రాజకీయ ప్రవేశం చేసిన అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ప్రస్తుతం పెందుర్తి ఎమ్మెల్యేగా ఉండగా, మరో దఫా పోటీలో ఉన్నారు.

సర్పంచ్ నుంచి ద్రోణం ప్రస్థానం

పెందుర్తి మండలం జుత్తాడ కరణంగా సుపరిచితులైన రాజకీయ దిగ్గజం దివంగత ద్రోణంరాజు సత్యనారాయణ రాజకీయ ప్రస్థానం సర్పంచ్ పదవితోనే ప్రారంభమయింది. ఆ తరువాత ఎమ్మెల్యే, ఎంపీ (లోక్‌సభ, రాజ్యసభ) జిల్లా పరిషత్ చైర్మన్, వుడా చైర్మన్ ఇలా ఎన్నో ఉన్నత పదవులు సాధించారు. 1976లో చినముషిడివాడ సర్పంచ్‌గా ఎన్నికైన ద్రోణంరాజు 1977లో జరిగిన పార్లమెంట్ మధ్యంతర ఎన్నికల్లో విశాఖ నుంచి పోటీచేసి తన ప్రత్యర్థి ప్రముఖ స్వతంత్ర సమరయోధుడు తెన్నేటి విశ్వనాథంపై గెలుపొంది లోక్‌సభలో అడుగుపెట్టారు. 1980లో పెందుర్తి అసెంబ్లీ నియోజవర్గ ఉప ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి పల్లా సింహాచలంపై విజయం సాధించి ఎమ్మెల్యే అయ్యారు. అనంతరం 1988-94 వరకు 94-2001 వరకు వరుసగా రెండు పర్యాయాలు రాజ్యసభ సభ్యులుగా ఉన్నారు. ఈ క్రమంలో వుడా (1980-82), జిల్లా పరిషత్ (1984)లో పదవులు పొందారు.. 2004లో విశాఖ- 1 ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఎన్నో ఉన్నత పదవులు అధిరోహించిన ద్రోణం మంత్రి కావాలనే కోరిక తీరకుండానే 2006లో కన్నుమూశారు.

సర్పంచ్ నుంచి ఎంపీగా ఎస్‌ఆర్‌ఎఎస్

పెందుర్తి మునసబుగా పరిచితులైన దివంగత ఎస్‌ఆర్‌ఏఎస్ అప్పలనాయుడు సర్పంచ్‌గానే రాజకీయ అరంగేట్రం చేశారు. 1964లో పెందుర్తి సర్పం చ్‌గా పనిచేసిన ఆయన 1967లో పరవాడ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈ క్రమంలో 1969 నుంచి 71 వరకు మత్స్యకార శాఖా మంత్రిగా పనిచేశారు. అనంతరం 1971, 77, 80లో మూడు పర్యాయాలు లోక్‌సభ సభ్యులుగా ఎన్నికయ్యారు. 1982లో వుడా చైర్మన్‌గా కూడా పనిచేశారు

రాంపురం సర్పంచ్ టు ఎమ్మెల్యే

పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కూడా సర్పంచ్‌గానే తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. 2006లో రాంపురం సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆయన 2019లో పెందుర్తి ఎమ్మెల్యేగా గెలిచారు. తాజాగా మరోసారి వైసీపీ నుంచి రాజకీయ బరిలో నిలిచారు.

వడదెబ్బకు పశువులకాపరి మృతి


రాజారావు

గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 4: మండలంలోని సంకాడ పంచాయతీలో వడదెబ్బకు ఓ పశువులకాపరి మృతి చెందాడు. ఇందుకు సంబంధించి స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి. కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన రాజారావు (58) ప్రతి రోజూ మాదిరిగానే గురువారం ఉదయం పశువులమందను అడవిలో మేతకు తీసుకు వెళ్లాడు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఎండ తీవ్రతకు పశువుల మందకాస్తూ పంట పొలాల వద్ద సొమ్మసిల్లి పడిపోయాడు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో అక్కడివారు అతనిని గుర్తించారు. అయితే అప్పటికే అతడు మృతిచెందినట్టు స్థానికులు చెపుతున్నారు.

ఎలమంచిలిలో కలెక్టర్ పర్యటన

- పోలింగ్ కేంద్రాల పరిశీలన


కొక్కిరాపల్లి పోలింగ్ కేంద్రంలో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టరు రవి పట్టన్‌శెట్టి

ఎలమంచిలి, ఏప్రిల్ 4: ఎలమంచిలి నియోజకవర్గంలో గురువారం జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పర్యటించి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పట్టణంలోని కోమటివీధిలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం సీపీపేట, కొక్కిరాపల్లి ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి మౌలిక వసతులు, ర్యాంప్‌లను పరిశీలించారు. అనంతరం రాంబిల్లి మండలంలోని మామిడివాడ, నారాయణపురం, అప్పలరాయుడుపాలెం, పూడి కాలనీల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలన చేశారు. అచ్యుతాపురం జెడ్పీహెచ్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. పోలింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, చిన్న పొరపాట్లకు కూడా అవకాశం ఇవ్వకుండా పక్కాగా ఉండాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి రిటర్నింగ్ అధికారి మనోరమ, తహసీల్దారులు, మునిసిపల్ కమిషనర్ కొండలరావు పాల్గొన్నారు.

సబ్బవరంలో వైసీపీకి భారీ కుదుపు

- పలు గ్రామాల నుంచి వందలాదిగా జనసేనలో చేరికలు
- రానున్న ఎన్నికలు అవినీతికి, అభివృద్ధికి మధ్య పోటీ
- జనసేన పెందుర్తి అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు


జనసేనలో చేరిన వైసీపీ శ్రేణులతో పంచకర్ల రమేశ్‌బాబు

సబ్బవరం, ఏప్రిల్ 4:

రానున్న ఎన్నికలు అవినీతికి, అభివృద్ధికి మధ్య పోరాటమేనని జనసేన పెందుర్తి అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. మండలంలోని గొటివాడలో జరిగిన సభలో పలు గ్రామాలకు చెందిన వందలాది వైసీపీ శ్రేణులు జనసేన పార్టీలో చేరారు. వారందరికీ పంచకర్ల పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోచుకో, దాచుకో రీతిలో పాలన సాగించిన వైసీపీని రానున్న ఎన్నికల్లో తరిమి తరిమి సాగనంపాలని పిలుపునిచ్చారు. అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా, డిప్యూటీ సీఎంగా ఈ ప్రాంతానికి చేసిన మేలు ఒక్కటైనా చెప్పగలరా అని ప్రశ్నించారు. గ్లాసుకు, కమలానికి ఓటేసి గెలిపిస్తే అభివృద్ధి ఎలా ఉంటుందో సీఎం రమేశ్, తాను చూపిస్తామని పంచకర్ల చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ ఎన్నికల పరిశీలకులు శ్రీనివాసులనాయుడు, కూటమి నేతలు ఇందలి వెంకటరమణ, కర్రి కనకరాజు, గొర్లి రామునాయుడు, బీఏ రావు, గండి దుర్గాప్రసాద్, గొంప నరసింగరావు, కేవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

జనసేనలో చేరిన వైసీపీ శ్రేణులు

మండలంలోని పలు గ్రామాలకు చెందిన వైసీపీ నేతలు, కార్యకర్తలు జనసేనలో చేరారు. మాజీ ఎంపీపీ, గొట్టివాడ సర్పంచ్ సాలాపు మీన, భర్త వెంకటేశ్వరరావు, వైస్‌ఎంపీపీ-1 దాడి ఝాన్సీలక్ష్మీరాణి, భర్త రాము, ఆరిపాక మాజీ ఎంపీటీసీ సభ్యురాలు శరగడం ధనలక్ష్మి, భర్త అప్పలనాయుడు, తవ్వవానిపాలెం సర్పంచ్ బోకం స్వామినాయుడు, 9 మంది వార్డు మెంబర్లు, గొర్లివానిపాలెంకు చెందిన గొర్లి కుమార్, మండల కోఆప్షన్ మెంబరు గొర్లి నూకరాజు, పరవాడ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొద్దపు వెంకటరమణ, వైసీపీ మండల మహిళా అధ్యక్షురాలు బంతికోళ్ల పద్మ, వారి అనుచరులు వందలాదిగా జనసేనలో చేరారు.

ఘోరం


హనుమంతు ఆనందరావు(ఫైల్)


హనుమంతు చంద్రశేఖర్(ఫైల్)


చింతాడ ఇందుమతి(ఫైల్)

- పెందుర్తి సమీపాన రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొన్న మినీ వ్యాన్
- ముగ్గురి మృతి, ఏడుగురికి తీవ్రగాయాలు
- మృతుల్లో తండ్రి,కొడుకు
- పెళ్లి నుంచి వస్తుండగా విషాదం

పెందుర్తి, ఏప్రిల్ 4: పెందుర్తి సమీపంలో గల అక్కిరెడ్డిపాలెం వద్ద జాతీయ రహదారి (నంబర్ 16)పై గురువారం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని మినీ వ్యాన్ ఢీకొనడంతో ముగ్గురు మృతిచెందారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే పెందుర్తి సీఐ ఎల్.రామకృష్ణ నేతృత్వంలో సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో నుజ్జయిన వ్యాన్ నుంచి క్షతగాత్రులను అత్యంత లాఘవంగా బయటకు తీసి చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ ప్రమాదానికి సంబంధించి సీఐ ఎల్.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామం నుంచి హనుమంతు ఆనందరావు, హనుమంతు చంద్రశేఖర్, చింతాడ ఇందు, అమ్మయ్యమ్మ, బొడ్డేపల్లి జ్యోతి, మెట్ట లక్ష్మి, సిపాని వెంకటలక్ష్మి, నాగమణి, తమ్మినేని నీలవేణిలు బుధవారం ఉదయం మినీ వ్యాన్‌లో శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం గోగన్నపేట పంచాయతీ రంగానాథపేటలో జరిగిన బంధువుల వివాహానికి వెళ్లారు. బుధవారం రాత్రి వివాహ వేడుక ముగిసిన తరువాత శ్రీకాకుళం నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. వ్యాన్‌ను వినయ్ డ్రైవ్ చేస్తున్నాడు. పెందుర్తి బైపాస్ రోడ్డులో సరిపల్లి సమీపంలో అక్కిరెడ్డిపాలెం వద్దకు వచ్చేసరికి వ్యాన్ అదుపుతప్పి రహదారి పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ క్రమంలో వ్యాన్ ముందుభాగం పూర్తిగా నుజ్జయింది. డ్రైవర్ పక్కన కూర్చున్న హనుమంతు ఆనందరావు (45), హనుమంతు చంద్రశేఖర్ (15) చింతాడ ఇందుమతి (65) అక్కడికక్కడే మృతిచెందారు. డ్రైవర్ వినయ్‌తో పాటు మిగతా వారికి తీవ్రగాయాలయ్యాయి. కాగా మృతుల్లో హనుమంతు ఆనందరావు (45), చంద్రశేఖర్ (17) తండ్రీకొడుకులు. వీరంతా దశాబ్దం కిందట పనుల కోసం శ్రీకాకుళం జిల్లా నుంచి పశ్చిమ గోదావరి జిల్లాకు వలస వెళ్లారని పోలీసులు చెబుతున్నారు. క్షతగాత్రుల పరిస్థితి మెరుగ్గానే ఉందని సీఐ రామకృష్ణ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి డ్రైవర్ నిద్రమత్తులోకి వెళ్లడమే కారణమని పోలీసులు చెబుతున్నారు. కాగా ఆనందరావు కూలి పనికి వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటుండగా, చంద్రశేఖర్ ఇటీవలె పదో తరగతి పరీక్షలు రాశాడు. ఈ ఘటనతో తిరుగుడుమెట్టలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రాజానపాలెంలో వృద్ధులకు అందని పెన్షన్లు

- తంతడి సచివాలయానికి వెళ్లి తీసుకోవాలని అధికారుల ఆదేశాలు
- ఎమ్మెల్యే ఆదేశాల మేరకే ఇలా చేస్తున్నారని సర్పంచ్ ఆరోపణ
- గ్రామంలో నేడు పంపిణీ చేయకుండా ఆందోళన చేస్తామని హెచ్చరిక


రాజానపాలెం సామాజిక భవనం వద్ద పెన్షన్ల కోసం వేచి ఉన్న వృద్ధులు

అచ్యుతాపురం, ఏప్రిల్ 4:

సచివాలయ సిబ్బందితో ఇంటింటికి వెళ్లి పెన్షన్లు పంపిణీ చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించినా మండలంలోని రాజానపాలెం పంచాయతీలో పెన్షన్‌దారులు వివక్షకు గురవుతున్నారు. వీరికి ఇంతవరకు పెన్షన్ ఇవ్వలేదు.. సరికదా పక్క పంచాయతీకి వెళ్లి తీసుకోమని అధికారులు చెబుతున్నారు. ఎమ్మెల్యే కన్నబాబు రాజు ఆదేశాల మేరకు అధికారులు నడుచుకుంటున్నారని సర్పంచ్ రాజాన ఉమాదేవి ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. రాజానపాలెం పంచాయతీలో 120 మంది పెన్షన్‌దారులున్నారు. ఇందులో 60 మంది వృద్ధులే ఉన్నారు. వీరికి ఇంతవరకు పెన్షన్ సక్రమంగా అందేది. రాజానపాలెం పంచాయతీ సర్పంచ్ రాజాన ఉమాదేవి టీడీపీకి చెందిన వారు కావడంతో ఆ గ్రామంలో పెన్షనర్లకు పెన్షన్ ఆపేశారు. దీంతో ఉమాదేవి బుధవారం అధికారులను సంప్రదించగా, గురువారం నుంచి రాజానపాలెం సామాజిక భవనంలో పెన్షన్లు పంపిణీ చేస్తామని, ఏర్పాట్లు చేయమని చెప్పారు. దీంతో సర్పంచ్ ఉమాదేవి గ్రామంలో చాటింపు వేయించారు. గురువారం ఉదయం పెన్షన్‌దారులంతా కమ్యూనిటీహాల్ వద్ద ఉదయం నుంచి నుంచి వేచి చూడగా మధ్యాహ్నం అయినా ఏ అధికారి రాలేదు. దీంతో సర్పంచ్ ఉమాదేవి ఆరా తీయగా పక్క పంచాయతీ అయిన తంతడి సచివాలయానికి వెళ్లి తీసుకోమని అధికారులు చెబుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే కన్నబాబు రాజు రాజానపాలెం పెన్షనర్లకు పెన్షన్లు ఇళ్ల వద్ద ఇవ్వవద్దని, పక్క పంచాయతీకి వెళ్లి తీసుకోమని చెప్పారని ఆమె ఆరోపించారు. వయో వృద్ధులు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న తంతడి పంచాయతీకి వెళ్లి ఎలా పెన్షన్లు తీసుకుంటారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పంచాయతీ పరిధిలో పెన్షన్లు పంపిణీ చేయకపోతే ఆందోళన చేస్తామని ఆమె హెచ్చరించారు.

750 కిలోల రేషన్ బియ్యం పట్టివేత


లింగంపేటలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్న గ్రామస్థులు

గొలుగొండ, ఏప్రిల్ 4: మండలంలోని లింగంపేటలో రేషన్ బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా గ్రామస్థులు పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని లింగంపేటలో 22వ రేషన్ డిపో నుంచి రేషన్ బియ్యాన్ని ఆటోలో నర్సీపట్నం తరలిస్తుండగా గ్రామస్థులు గురువారం రాత్రి పట్టుకొని పోలీసులకు, తహసీల్దార్‌కు సమాచారం అందించారు. రేషన్ డీలర్ ఎం.స్వామినాయుడు, ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసే వాహనదారుడు కుమ్మక్కై 15 బస్తాల్లో 750 కిలోల బియ్యాన్ని తరలిస్తున్నారు. దీనిపై తహసీల్దార్ భాస్కరరావును ఫోన్లో సంప్రదించగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్టు లింగంపేట గ్రామస్థులు తమకు సమాచారం అందించారన్నారు. బియ్యాన్ని తమ సిబ్బంది స్వాధీనపర్చుకుని డిపో వద్దే వుంచామన్నారు. పూర్తిగా విచారణ అనంతరం డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేస్తామన్నారు. వాహనదారుడిపై ఆర్డీవోకు నివేదిక అందిస్తామన్నారు.

సర్పంచులను ఇబ్బంది పెట్టొద్దు

- విద్యుత్ బిల్లుల పేరుతో వేధించవద్దు
- సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షురాలు సుజాత

పరవాడ, ఏప్రిల్ 4: విద్యుత్ బిల్లుల పేరుతో ప్రభుత్వం సర్పంచులను ఇబ్బంది పెట్టడం సరికాదని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షురాలు, ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాత కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో కరెంట్ బిల్లులకు సంబంధించి ఎటువంటి జమా లెక్కలు లేకపోయినా రాష్ట్ర ప్రభుత్వం రూ.8,629.69 కోట్లు విద్యుత్ బిల్లులకు బదలాయించామని చెప్పడం దారుణమన్నారు. విద్యుత్ బిల్లులు చెల్లించి ఉంటే ఏ గ్రామ పంచాయతీ నుంచి ఎంత బిల్లు చెల్లించారో తెలియజేయాలన్నారు. చెల్లించిన బిల్లులకు రశీదులను గ్రామ పంచాయతీలకు ఇప్పటికీ అందజేయలేదన్నారు. ఇంత జరిగినా కూడా మళ్లీ విద్యుత్ బిల్లులు చెల్లించాలని సర్పంచులపై తీవ్ర ఒత్తిడి తీసుకురావడం అన్యాయమన్నారు. ప్రస్తుత వేసవిలో గ్రామీణ ప్రజలకు తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్ల నిర్వహణ తదితర మౌలిక సౌకర్యాలు కల్పించలేని పరిస్థితుల్లో సర్పంచులు ఉన్నారని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ బిల్లులు చెల్లించాలని సర్పంచులపై ఒత్తిడి చేయవద్దని కోరారు.

ఘనంగా పరదేశమ్మ విగ్రహ ప్రతిష్ఠ

ఎలమంచిలి, మార్చి 4: మునిసిపాలిటీలోని కొత్తపాలెం వార్డులో పరదేశమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పురోహితులు వినయ్ శర్మ శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేపట్టారు. స్వర్గీయ రాపేటి గోవింద్ జ్ఞాపకార్థంఅయన కుమారుడు జగ్గారావు, గ్రామస్థుల సహకారంతో ఆలయ నిర్మాణాన్ని చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో రాపేటి సంతోష్, ఆడారి భాస్కర్, ఆడారి అప్పారావు, రాపేటి పైడియ్యనాయుడు, రాపేటి చంద్రరావు, భక్తులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా జరిగేలా పక్కా ప్రణాళిక

... 5వ పేజీ తరువాయి

ప్రత్యేక అకౌంట్ నిర్వహించి రిటర్నింగ్ అధికారి లేదా వ్యయ పరిశీలకులకు రోజువారీ నివేదిక అందించాలని చెప్పారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించి అనుమతి పొందేందుకు ప్రత్యేకంగా సువిధ యాప్ ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. అభ్యర్థి పార్టీ లేదా సొంతంగా గానీ తాను సేకరించిన మొత్తం లేదా విరాళం వివరాలను జమగా చూపించాల్సి ఉంటుందన్నారు. వాహనాలు, సభలు, సమావేశాల నిర్వహణ, అన్ని విధాలా ప్రకటనలు, కమిషన్ నిర్ణయించిన రేట్లను అనుసరించే లెక్కిస్తారని చెప్పారు.

మౌనానికి కారణమేంటో?

... 5వ పేజీ తరువాయి

పెడుతున్నారా? అని నియోజకవర్గంలో చర్చ సాగుతోంది. జమీలుగా పిలుచుకునే సన్యాసిపాత్రుడు 2019 అసెంబ్లీ ఎన్నికల తరువాత టీడీపీని వీడి వైసీపీలో చేరారు. సీఎం జగన్.. చింతకాయల సన్యాసిపాత్రుడు భార్య అనితకు డీసీసీబీ ఛైర్‌పర్సన్‌గా అవకాశం ఇచ్చారు. డీసీసీబీ పదవి వచ్చిన తరువాత ఎమ్మెల్యేకు, సన్యాసిపాత్రుడు మధ్య దూరం పెరిగింది. సన్యాసిపాత్రుడు రెండో ప్రత్యామ్నాయంగా మారతారని ఉద్దేశంతోనే ఎమ్మెల్యే మునిసిపాలిటీలోని కార్యక్రమాలకు మాత్రమే పరిమితం చేశారని అనుకుంటున్నారు. మెయిన్ రోడ్డు విస్తరణ విషయంలో జమీలు తల దూర్చి భవన యజమానులకు మద్దతుగా విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, సీఎం వరకు తీసుకు వెళ్లారని ఎమ్మెల్యే గణేశ్ మనస్సులో పెట్టుకున్నారని, ఈ విషయంలో ఇద్దరి మధ్య దూరం పెరిగిందని అంటున్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కూడా జమీలు ఎన్నికల ప్రచారంలో కనిపించడం లేదు. ఎమ్మెల్యే ఒక్కరే మండలాల్లో ఎన్నిక ప్రచారం చేస్తున్నారు. ఈ విధంగా వైసీపీ, టీడీపీలోని ఇద్దరు కీలక నేతలు ప్రచారంతో పాల్గొనకపోవడంతో నియోజకవర్గంలో చర్చకు దారి తీసింది.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు

... 5వ పేజీ తరువాయి

ఎంపీడీవో ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయాన్ని నియోజకవర్గ ఆర్‌వో జయరాంకు నివేదిస్తున్నట్టు ఆయన తెలిపారు.

నర్సీపట్నంలో 65 మంది..

నర్సీపట్నం: మునిసిపాలిటీలో 65 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. గురువారం మునిసిపల్ కమిషన్ రవిబాబుకి వీరంతా రాజీనామా పత్రాలు అందజేశారు. గత రెండు రోజుల్లో 195 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారని కమిషనర్ తెలిపారు.

బి.కింతాడలో 13 మంది..

దేవరాపల్లి: మండలంలోని బి.కింతాడలో 13 మంది వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. ఈ మేరకు ఎంపీడీవో పేరిట రాజీనామా లేఖలను సచివాలయ కార్యదర్శి అప్పారావుకు అందజేశారు. గ్రామంలో రాజకీయ నాయకులు తమను సంఘ విద్రోహ శక్తులుగా చూస్తున్నారని, వారి ఒత్తిళ్లు తట్టుకోలేక రాజీనామా చేస్తున్నట్టు వలంటీర్లు కొప్పాక నాగేంద్ర, హరికృష్ణ, మోహన్, ఇందిర, చంద్రశేఖర్ తదితరులు పేర్కొన్నారు.

నాతవరం మండలంలో 182 మంది..

నాతవరం: నాతవరం మండలంలో 182 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేసినట్టు ఎంపీడీవో జె.రాంబాబు తెలిపారు. వలంటీర్లు ముకుమ్మడిగా రాజీనామా లేఖలను అందజేసినట్టు తెలిపారు.

చోడవరంలో ఉద్రిక్తత

... 5వ పేజీ తరువాయి

సీఎం రమేష్ అన్నారు. జగన్ పాలనలో అక్రమాలకు ఇది నిలువెత్తు నిదర్శనమన్నారు. ఇప్పటికే వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, గ్రానైట్ వ్యాపారులను వైసీపీ నేతలు వేధింపులకు గురిచేసి రాష్ట్రం వదిలి పారిపోయే పరిస్థితి కల్పించారన్నారు. ఎన్నికల సమయంలో సైతం అధికార పార్టీ ఎమ్మెల్యే ధర్మశ్రీ మాట వినలేదన్న కోపంతో వ్యాపారిపై అధికారులను ఉసిగొల్పడం దారుణమన్నారు. అధికార పార్టీ నేతలకు మరో 40 రోజులే ఉందని, ఆ తరువాత వారి తప్పిదాలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఈర్లె శ్రీరామమూర్తి, టీడీపీ నాయకులు మత్స్యరాజు, సకురు కోటేశ్వరరావు, జనసేన నాయకులు గూనూరు మూలినాయుడు, కర్రి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మాట వినలేదనే ధర్మశ్రీ మాపై కక్ష కట్టారు: దుకాణం యజమాని

తన మాట వినలేదన్న కక్షతోనే కరణం ధర్మశ్రీ దాడులు చేయించారని టైల్స్ దుకాణం యజమాని బుచ్చిబాబు ఆరోపించారు. తన దుకాణం నుంచి టైల్స్ తీసుకుని డబ్బులు ఇవ్వలేదు సరికదా...లక్షలాది రూపాయలు అడుగుతున్నారని ఆరోపించారు. బుచ్చిబాబు కుమార్తెలు కూడా ఈ సందర్భంగా ధర్మశ్రీపై తీవ్రస్థాయిలో అవినీతి ఆరోపణలు చేశారు.

జగన్ పాలనలో అప్పులపాలైన రాష్ట్రం

- మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు
- టీడీపీలో చేరిన గూటూరు శ్రీనివాసరావు



మాట్లాడుతున్న మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు

పాయకరావుపేట, ఏప్రిల్ 4 : జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అప్పులపాలైందని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. గురువారం మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ గూటూరు శ్రీనివాసరావు టీడీపీలో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఇసుక, గ్రావెల్‌తోపాటు అన్ని వనరులను దోచుకున్న ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పులపాల్జేసి అన్ని వ్యవస్థలను నాశనం చేశాడన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థుల గెలుపునకు సమిష్టి కృషిచేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే వి.అనిత మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ బీజేపీ అభ్యర్థి సీఎం.రమేశ్‌ని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషిచేయాలని కోరారు. అంతకుముందు టీడీపీలో చేరిన గూటూరు శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు, కార్యకర్తలకు అయ్యన్నపాత్రుడు, వి.అనిత కండువాలు వేసి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం టీడీపీలో చేరిన గూటూరు శ్రీనివాసరావును జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ తోట నగేశ్ తదితరులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండలాల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు, కొప్పిశెట్టి వెంకటేశ్, అమలకంటి అబద్ధం, జానకి శ్రీను, పట్టణ పార్టీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు యేజర్ల వినోద్‌రాజు, లాలం కాశీనాయుడు, గొర్రెల రాజబాబు, మజ్జూరి నారాయణరావు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సమష్టిగా ముందుకు పోదాం

- మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న పప్పల, సుందరపు, ప్రగడ

ఎలమంచిలి, ఏప్రిల్ 4: రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా సమిష్టిగా ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు కూటమి పార్టీల శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం పురుషోత్తపురంలో జనసేన ఎలమంచిలి అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, సీఎం రాజేష్, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ కూటమి అభ్యర్థుల విజయానికి ప్రజలంతా సహకరించాలని కోరారు. ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ అధిష్ఠానం ఆదేశానుసారం పార్టీ శ్రేణులంతా ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌లను గెలిపించేందుకు కృషిచేయాలన్నారు. అంతకుముందు గ్రామంలో టీడీపీ నేత కొలుకులూరి విజయ్‌బాబు స్వగృహంలో పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నేతలు కాండ్రకోట చిరంజీవి, రాజాన నారాయణమ్మ, రాజాన సూర్యనాగేశ్వరరావు, బొద్దపు శ్రీను, లవుడు లోవరాజు, కొఠారు సాంబ, గొన్నాబత్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం : కొణతాల

అనకాపల్లి రూరల్/కశింకోట/కొత్తూరు ఏప్రిల్ 4 : కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ అన్నారు. మండలంలోని గోపాలపురం, భట్లపూడి, రాయుడుపేట గ్రామాల్లో గురువారం టీడీపీ-జనసేన-బీజేపీ శ్రేణులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అనకాపల్లిని పారిశ్రామిక హబ్‌గా మారుస్తామన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి అభ్యర్థి గెలుపునకు కూటమి శ్రేణులంతా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జెర్రిపోతుల శ్రీనివాసరావు, తలారి కాశీనాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే సత్యనారాయపురంలో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు గురువారం అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ, ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌లకు మద్దతుగా ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు చొప్ప పూర్ణ, కుండల రాజు, ఉగ్గిన వాసు, టీడీపీ నాయకులు చీర రాజు, యూనిట్ ఇన్‌చార్జి జోగా భాను, అమలాపురం రాజు, తాడి శంకరరావు పాల్గొన్నారు. ఏనుగుతుని గ్రామంలో గొంతిన చిరంజీవి ఆధ్వర్యంలో మహిళలతో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ, ఎంపీ అభ్యర్థి ఎంపీ రమేశ్‌లను గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు శీరం వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాలల్లో మాక్ పోలింగ్



అచ్యుతాపురం రూరల్: తిమ్మరాజుపేట పాఠశాలలో విద్యార్థులచే మాక్ పోలింగ్‌ను చేయిస్తున్న ఉపాధ్యాయులు

నక్కపల్లి, ఏప్రిల్ 4: ఓటు హక్కు విలువ, ఓటు వినియోగంపై పిల్లలకు అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో గురువారం చినదొడ్డిగల్లు జడ్పీ హైస్కూల్‌లో మాక్ పోలింగ్ నిర్వహించారు. హెచ్‌ఎం బి.కవిత, ఉపాధ్యాయులు మున్నీషా బేగం, యేడిద వెంకట రమణ నేతృత్వంలో విద్యార్థులతో మాక్ పోలింగ్ నిర్వహించారు. పోలింగ్ సిబ్బంది విధులు ఎలా నిర్వహిస్తారో అవగాహన కల్పించారు.

ఎస్.రాయవరంలో.. మండలంలోని గుడివాడ జడ్పీ హైస్కూల్‌లో గురువారం హెచ్‌ఎం నాగన్నదొర ఆధ్వర్యంలో విద్యార్థులతో మాక్ పోలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పీవో, ఏపీవో, వోపీవో, బ్యాలెట్ బాక్స్, ఓటింగ్ కంపార్ట్‌మెంట్, ఓట్ల లెక్కింపు వంటి తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీడీ కుందూరు రాజు, టీచర్లు భవాని, పద్మావతి, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్‌లో.. మండలంలోని తిమ్మరాజుపేట ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులతో మాక్ పోలింగ్ నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం మారిశెట్టి వెంకట అప్పారావు ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలో విద్యార్థులకు వివరించారు. జిల్లా కలెక్టర్, డీఈవో సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు హెచ్‌ఎం తెలిపారు.

కశింకోటలో.. స్థానిక డీపీఎన్ జడ్పీ హైస్కూల్‌లో మాక్ పోలింగ్ గురువారం జరిగింది. హైస్కూలు ఇన్‌చార్జి హెచ్‌ఎం ఆచంట రవి, సెక్టార్ ఇన్‌చార్జి లావణ్య విద్యార్థులకు ఎన్నికల్లో ఓటు ఏ విధంగా వేస్తారనే అంశాలు, పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, బొడ్డేడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గొబ్బూరులో నూకాంబిక ఆలయం ప్రారంభం

కశింకోట, ఏప్రిల్ 4: మండలంలోని గొబ్బూరులో నూతనంగా నిర్మించిన నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు గురువారం ప్రారంభించారు. అనంతరం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ ఆలయంలోని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పక్షవాత బాధితునికి ఆర్థిక సాయం



బాధితుడు వెంకట్రావుకు నగదు అందజేస్తున్న దాడి రత్నాకర్

కశింకోట, ఏప్రిల్ 4: మండలంలోని నర్సింగబిల్లి శివారు చింతలపాలెంలో పక్షవాతంతో బాధపడుతున్న బొద్దూరి వెంకటరావుకు టీడీపీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ రూ.2,550 ఆర్థిక సాయం చేశారు. బాధితుడికి ఆరేళ్ల కిందట పక్షవాతం వచ్చి శరీరం చచ్చుబడిందని గ్రామ పెద్దల ద్వారా విషయం తెలుసుకొన్న రత్నాకర్ వెంకట్రావు ఇంటికి వెళ్లి డీవీఆర్ ఫౌండేషన్ ద్వారా నెలనెలా పింఛను ఇచ్చేందుకు నిర్ణయించారు. వచ్చే నెల నుంచి పింఛను రూపంలో రూ.2,550 బ్యాంకు అకౌంటులో వేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మజ్జి కుమార్, చింతలపాలెం నాయకులు కర్రి దుర్గునాయుడు, జెర్రిపోతుల నూకునాయుడు, పాల్గొన్నారు.

దిబ్బపాలెం వైసీపీ నాయకులు టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వైసీపీ నాయకులతో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం రూరల్, ఏప్రిల్ 4 : ఎలమంచిలి నియోజకవర్గంలోని దిబ్బపాలెం సెజ్ కాలనీలో వైసీపీ నాయకులంతా గురువారం పాయకరావుపేటలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీ ఎలమంచిలి ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కన్నబాబురాజు ముఖ్యఅనుచరులైన అచ్యుతాపురం మండల సచివాలయాల కన్వీనర్ రాజాన విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ రాజాన భానుప్రకాష్, వైసీపీ మండల ప్రధాన కార్యదర్శి అడిగర్ల దేవుడు, వార్డు సభ్యులు లాలం జగదీష్, సచివాలయ కన్వీనర్ గండి ప్రసాద్, సీనియర్ నాయకులు లాలం వాసు, లాలం వెంకట్, రేకా నాగేష్, రాజాన శివ, మడగల శివ, పంచదార్ల రమణ, లాలం వెంకటరమణ, రుత్తల కొండలరావు,సియాద్రి రాము, వంద మంది టీడీపీలో చేరారు. వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజాన రమేష్ కుమార్, జనపరెడ్డి నరసింగరావు, లాలం సత్యప్రసాద్, రాజాన నానాజీ, లాలం రాజు, నీరుకొండ నరసింగరావు పాల్గొన్నారు.

రెండు నెలల్లో రాక్షస పాలన అంతం : అనిత

నక్కపల్లి, ఏప్రిల్ 4: రెండు నెలల్లో రాష్ట్రంలో రాక్షస పాలన అంతమవుతుందని, కూటమి ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని టీడీపీ పాయకరావుపేట అభ్యర్థి వంగలపూడి అనిత అన్నారు. గురువారం రాత్రి వేంపాడులో ప్రజాగళం పాదయాత్రలో భాగంగా ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలంతా వైసీపీ పాలనపై విసిగిపోయారని, కూటమిని గెలిపించేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్, అయినంపూడి అప్పలరాజు, కుంచె మధు, గింజాల లక్ష్మణరావు , కొప్పిశెట్టి బుజ్జి, కురందాసు నూకరాజు పాల్గొన్నారు.

టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

పాయకరావుపేట : స్థానిక దుర్గానగర్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గురువారం టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గానగర్‌లోని ఇంటింటికి టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, ఎంపీటీసీ సభ్యురాలు ఎం.రమాకుమారి, జనసేన పట్టణ అధ్యక్షుడు ఆచంట దొర, వార్డు సభ్యురాలు దేవాది మంగాదేవి తదితరులు సూపర్ సిక్స్ పథకాలపై పచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లా విలియంకేరి, లెక్కల గోవిందు, జూరెడ్డి ప్రసాద్, జనసేన నాయకులు బీఎస్.నారాయణ, శివలంక నాగమల్లి, గీసాల పద్మ తదితరులు పాల్గొన్నారు.

మంచి విజయం ఖాయం : కన్నబాబురాజు

ఎలమంచిలి, ఏప్రిల్ 4 : రానున్న ఎన్నికల్లో గెలిచి తీరుతానని ఎమ్మెల్యే యూవీ రమణమూర్తి రాజు (కన్నబాబురాజు) అన్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తానెప్పుడూ ప్రత్యర్థి పార్టీ నాయకులను విమర్శించడం గానీ, తిట్టడం కాని చేయలేదని, నేను చేసిన అభివృద్ధి గురించి చెప్పుకోవడమే నా నైజం అన్నారు. అచ్యుతాపురంలో బుధవారం టీడీపీ, జనసేన బీజేపీ నాయకులంతా ఏదేదో మాట్లాడారు. నా మీద బురద చల్లే ప్రయత్నం చేశారన్నారు. విలేకర్ల సమావేశంలో డీసీసీబీ మాజీ ఛైర్మన్ యు.సుకుమారవర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్, ఏఎంసీ ఛైర్మన్ బొద్దపు యర్రయ్యదొర, మునిసిపల్ వైస్ ఛైర్మన్ ఆర్రెపు గుప్తా పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో హార్స్ రైడింగ్ కోచింగ్

అచ్యుతాపురం రూరల్, ఏప్రిల్ 4: మండలంలోని రామన్నపాలెంలో గుర్రాల స్వారీ శిక్షణ శిబిరాన్ని గురువారం కైట్స్ విద్యా విహార్ కరస్పాండెంట్ రెడ్డి గణేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ద్రీమ్స్ నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు లాలం శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణ పెళ్లిరాట

పాయకరావుపేట, ఏప్రిల్ 4: స్థానిక మంగవరం రోడ్డులోని రామాల యంలో ఈనెల 17వ తేదీన జరగనున్న సీతారామ కల్యాణం పురస్కరిం చుకుని గురువారం పెళ్లి రాటను వేశారు. ఆలయ అర్చకుడు విశేష పూజలు నిర్వహించిన అనంతరం మహిళా భక్తులు సీతారాముల పెళ్లిరాటను వేశారు. కార్యక్రమంలో వానర సేన సభ్యులు జగతా శ్రీను, మామిడి అప్పారావు, కొసిరెడ్డి నాగసూరి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు నయవంచన

... 5వ పేజీ తరువాయి

80 శాతం మంది పోలీస్, ఉపాధ్యాయ పోస్టుల కోసం శిక్షణ పొందుతున్నారు. వీరంతా విశాఖతోపాటు కాకినాడ, అవనిగడ్డ వంటి ప్రాంతాలకు వెళ్లి శిక్షణ తీసుకుంటున్నారు. ఇందుకోసం నెలకు కనీసం రూ.8 వేలు ఖర్చవుతుంది. అయితే ఈ ఐదేళ్లలో ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకపోవడంతో వారంతా రగిలిపోతున్నారు. జగన్ సర్కారు వల్ల జీవితం నాశనమైపోయిందని, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని డీఎస్సీకి ప్రిపేరవుతున్న శివ అనే యువకుడు ఆవేదన వ్యక్తంచేశాడు. మూడేళ్లపాటు అవనిగడ్డలో శిక్షణ తీసుకున్నానని, సుమారు మూడు లక్షల రూపాయలు తల్లిదండ్రులకు అప్పు మిగిల్చానని, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఇంటికి వెళ్లాలో అర్థం కావడం లేదన్నాడు. తనలాంటి ఎంతోమంది ఉసురు వైసీపీకి తగులుతుందని శాపనార్థాలు పెట్టాడు. పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించాలన్న కల ఎప్పటికి నెరవేరుతుందో అర్థం కావడం లేదని వెంకటేష్ అనే మరో నిరుద్యోగి వాపోయాడు. ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించానని, తదుపరి దశ కోసం ఏడాది నుంచి ఎదురుచూస్తున్నానన్నాడు. నిరుద్యోగులను జగన్ ప్రభుత్వం దగా చేసిందని, ప్రభుత్వ ఉద్యోగంతో ఇంటికి వెళతామని ఆశపడ్డ తనలాంటి ఎంతోమందిని వైసీపీ సర్కారు తీవ్ర నిరాశకు గురిచేసిందని లక్ష్మి తులసీ అనే డీఎస్సీ అభ్యర్థిని ఆవేదన వ్యక్తం చేశారు.

టీడీపీ హయాంలో భారీగా పోస్టుల భర్తీ

తెలుగుదేశం పార్టీ హయాంలో 2014 నుంచి 2019 మధ్యకాలంలో భారీగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీచేశారు. పోలీస్ శాఖలో సుమారు 15 వేలకుపైగా ఖాళీలను భర్తీచేయగా, గ్రూప్-2 పోస్టుల భర్తీకి రెండుసార్లు నోటిఫికేషన్ ఇచ్చారు. 2016లో 900 పోస్టులు, 2018లో 440 పోస్టులను భర్తీచేశారు. అలాగే 2018లో 7,900 ఉపాధ్యాయ ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేసింది. ఆ తరువాత ఇప్పటివరకూ ఆయా శాఖల్లో ఒక్క కొత్త పోస్టును భర్తీచేయలేదు. కానిస్టేబుల్ నియామక ప్రక్రియ మధ్యలో ఉండగా, ఎస్‌ఐ పోస్టుల భర్తీ ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు. కొద్దిరోజుల కిందటే గ్రూప్-1, గ్రూప్-2 అభ్యర్థులకు రాత పరీక్షను నిర్వహించారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని హడావిడిగా నోటిఫికేషన్లు ఇవ్వడం తప్పితే...గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చుకోవాలన్న ఆలోచన ఈ ప్రభుత్వ పెద్దల్లో కనిపించ లేదని నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు. ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో నోటిఫికేషన్లు ఇచ్చి నిరుద్యోగులను మభ్యపెట్టాలని జగన్ సర్కారు చూసిందని రాజేష్ యలమల అన్నాడు. వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేందుకు నిరుద్యోగులు సిద్ధంగా ఉన్నారన్నాడు.

సీఎం రమేశ్‌కు ఎమ్మార్పీఎస్ మద్దతు



సీఎం రమేశ్‌కు మద్దతు తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కొత్తూరు, ఏప్రిల్ 4 : బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం మద్దతు తెలిపారు. ఈ మేరకు అనకాపల్లి హైవేపై ఉన్న బీజేపీ కార్యాలయంలో సీఎం రమేశ్‌ను వారంతా గురువారం కలిశారు. కమలం గుర్తు ప్రతి గడపకూ చేర్చే బాధ్యత తీసుకుంటామని, కూటమి విజయానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం సీఎం రమేశ్‌ను సత్కరించారు.

నూకాంబిక ఆలయంలో కొణతాల పూజలు

- బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులతో సమావేశం



బార్ అసోసియేషన్‌లో మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 4 : జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ గురువారం పట్టణంలో విస్తృతంగా ప్రచారం చేశారు. తొలుత నూకాంబిక అమ్మవారిని దర్శించుకుని, అర్చకులచే ప్రచార రథానికి పూజలు చేశారు. యిమ్మిడిశెట్టి నాగబాబు, పద్మజ పూజలు చేసి ప్రచార రథాన్ని ప్రారంభించారు. అనంతరం బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులతో సమావేశమయ్యారు. రానున్న ఎన్నికల్లో అసెంబ్లీకి తనను గాజుగ్లాసుపై, పార్లమెంట్‌కు సీఎం రమేష్‌కు కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ, బీఎస్ఎంకే జోగినాయుడు, మళ్ల సురేంద్ర, జనసేన నాయకులు తాడి రామకృష్ణ, శ్రీరామదాసు గోవిందరావు పాల్గొన్నారు.

82వ వార్డులో బూడి, మలసాల ఎన్నికల ప్రచారం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 4: స్థానిక 82వ వార్డు విజయరామరాజుపేటలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు ఆధ్వర్యంలో గురువారం వైసీపీ పార్లమెంట్ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ముందుగా వినాయకుని ఆలయంలో పూజలు చేసి దర్శించుకున్నారు. ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పలకా రవి, పలకా యశోధ, డాక్టర్ రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్యాలయానికి నెబ్యులైజర్ బహూకరణ

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 4 : స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి జై భారత్ నేషనల్ పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కనిశెట్టి సురేష్ బాబు గురువారం నెబ్యులైజర్ పరికరాన్ని బహూకరించారు. పార్టీ వ్యవస్థాపకులు, సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ జన్మదినం సందర్భంగా జేడీ ఫౌండేషన్ తరుపున ఈ పరికరాన్ని ఆర్‌ఎంవో లక్ష్మణ్‌శ్రీనివాస్‌కు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు అశోక్, నాయుడు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్మీ ఉద్యోగి రూ. లక్ష విరాళం



ఆలయ ప్రతినిధులకు రూ. లక్ష అందజేస్తున్న గండి చిన్నాధర్

పరవాడ, ఏప్రిల్ 4 : మండలంలోని పి.బోనంగిలో నూతనంగా నిర్మిస్తున్న షిర్డీ సాయిబాబా ఆలయ నిర్మాణానికి కైలాసపురానికి చెందిన ఆర్మీ ఉద్యోగి గండి చిన్నాధర్ శ్యామల దంపతులు లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని గురువారం ఆలయ కమిటీ ప్రతినిధులు బి.నాగేశ్వరరావు, జె.శ్రీను, గొంది లోకేష్‌లకు ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పైలా శ్రీనివాసరావు, బండారు గోవిందరావు పాల్గొన్నారు.

'అనితను అధిక మెజార్టీతో గెలిపిద్దాం'

నక్కపల్లి, ఏప్రిల్ 4: టీడీపీ పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనితను అధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించుకుందామని అమలాపురం టీడీపీ, జనసేన నాయకులు, మత్స్యకారులు తీర్మానించారు. గురువారం అమలాపురంలో జరిగిన సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ బూత్ స్థాయి నుంచి అనితకు మెజారిటీ వచ్చేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెదపాటి శంకరరావు, ఎరుపిల్లి అప్పలరాజు, ఉపసర్పంచ్ గబ్బర్ సింగ్, వంకా గోపీ పాల్గొన్నారు.

రాంబిల్లి ప్రధాన రోడ్డును మరమ్మతులు చేయాలి

రాంబిల్లి, ఏప్రిల్ 1 : గోతులమయమైన రాంబిల్లి ప్రధాన రోడ్డును పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని సీపీఎం మండల కన్వీనర్ జి.దేముడునాయుడు గురువారం ఒక ప్రకటనలో కోరారు. వెంకటాపురం జంక్షన్ నుంచి వాడనర్సాపురం సమీపంలోని నేవీ గేటు వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతిందన్నారు. అడుగడుగునా గోతులు ఏర్పడి, రాళ్లుతేలిపోయి ప్రమాదాలకు నిలయంగా తయారయ్యిందన్నారు. అధికారులు స్పందించి ఈ రోడ్డుపై ఒక లేయర్ తారు అయినా వేయాలని కోరారు.


పెన్షన్ల పంపిణీపై ప్రత్యేకాధికారి సమీక్ష

నక్కపల్లి, ఏప్రిల్ 4: మండలంలోని సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీపై గురువారం ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రావు సమీక్షించారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో సీతారామరాజులతో సచివాలయాల వారీగా పెన్షన్ల పంపిణీ వివరాలను తెలుసుకున్నారు. మూడో తేదీ నుంచే పెన్షన్లు పంపిణీ ప్రారంభించామని, శనివారం నాటికి మొత్తం పూర్తవుతాయని ఎంపీడీవో చెప్పారు. పెన్షన్ల పంపిణీలో ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని ప్రత్యేకాధికారి సూచించారు.

టిడ్కో గృహ సముదాయం సమస్యలపై ఆరా

ఎలమంచిలి, ఏప్రిల్ 4 : మునిసిపాలిటీలోని రామ్‌నగర్ సమీపంలో టిడ్కో గృహ సముదాయాన్ని గురువారం టిడ్కో అధికారులు సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. టిడ్కో డీఈ సంధ్య, ఏఈఈ అనూషాలు టిడ్కో లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత నెల 31 వ తేదీన 'టిడ్కో కాలనీలో నీటి ఇబ్బందులు' శీర్షికన వచ్చిన వార్తకు టిడ్కో అధికారులు స్పందించారు. ఈ కాలనీలో నెలకొన్న తాగునీటి సదుపాయం, డ్రైనేజీ, లీకేజీలు తదితర పలు సమస్యలను కాలనీ వాసులు అధికారుల ముందుంచారు. ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ సంఘం ప్రతినిధులు ప్రసాద్, హైరామ్, ముఖ్య సలహాదారు ఆడారి గంగాధర్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పరవాడ, ఏప్రిల్ 4 : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని వాడచీపురుపల్లి హైస్కూల్ హెచ్‌ఎం పి. కనకేశ్వరరావు అన్నారు. నేషనల్ గ్రీన్ కోర్ ఆంధ్రప్రదేశ్ సంచాలకులు టి. స్రవంతి, డీఈవో వెంకటలక్ష్మమ్మ ఆదేశాల మేరకు పాఠశాలలో గురువారం నిర్వహించిన పర్యావరణ పరిరక్షణ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ముత్యాలమ్మపాలెం హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం సత్యదేవ్, ఏపీఎన్‌జీసీ జిల్లా కో-ఆర్డినేటర్ ఖగేశ్వరరావు, క్లస్టర్ కో-ఆర్డినేటర్ బి.అన్నాజీరావు పాల్గొన్నారు.

నర్సీపట్నం నియోజకవర్గం

గ్రామాల్లో పరిస్థితులపై ప్రత్యేక దృష్టి : డీఎస్పీ



స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ మోహన్

గొలుగొండ, ఏప్రిల్ 4 : మండలంలోని కృష్ణాదేవిపేట పోలీస్ స్టేషన్‌ను నర్సీపట్నం డీఎస్పీ మోహన్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి, కేసుల వివరాలు తెలుసుకున్నారు. ఎన్నికలు గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో సాగేలా చర్యలు చేపట్టాల్సిందిగా రూరల్ సీఐ హరి, కృష్ణాదేవిపేట ఎస్ఐ ఉపేంద్రలకు సూచించారు. ఓటర్లను ప్రలోభ పెట్టే వారిపై దృష్టి సారించాలన్నారు. చెక్ పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు.

మునిసిపాలిటీలో 87.89 శాతం పెన్షన్ల పంపిణీ



వృద్ధురాలికి ఇంటి వద్ద పెన్షన్ అందిస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ

నర్సీపట్నం, ఏప్రిల్ 4 : మునిసిపాలిటీలో 87.89 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తయింది. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం మధ్యాహ్నం వరకు ఈ సొమ్మును బ్యాంకుల్లో జమ చేయని కారణంగా వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ తరువాత జమ కావడంతో మునిసిపాలిటీలోని 17 సచివాలయ వద్ద సాయంత్రం లబ్ధిదారులు పెన్షన్ల సొమ్ము పంపిణీ ప్రారంభించారు. ఎండ ప్రభావం లబ్ధిదారులపై పడకుండా గురువారం ఉదయం ఏడు గంటల నుంచే పంపిణీ ప్రారంభించారు. దివ్యాంగులు, కురు వృద్ధులు, అనారోగ్యంతో మంచానికి పరిమితమై వారి ఇళ్లకు సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీలు వెళ్లి అందజేశారు. శుక్రవారంతో పింఛన్లు పంపిణీ పూర్తి చేస్తామని మునిసిపల్ కమిషనర్ పూడి రవిబాబు తెలిపారు.

దివ్యాంగులు, వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్

- వచ్చే నెల మూడో తేదీ నుంచి ఇళ్లకు వెళ్లి దరఖాస్తుల స్వీకరణ
- అధికారుల సమావేశంలో ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ జయరాం

నర్సీపట్నం, ఏప్రిల్ 4 : దివ్యాంగులు, వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తులు తీసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ హెచ్‌వీ జయరాం సూచించారు. గురువారం ఇక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ బృందం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే నాలుగో తేదీన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. మే 3 నుంచి 8 తేదీ వరకు దివ్యాంగులు, 85 సంవత్సరాలు వృద్ధుల నుంచి వారి ఇళ్లకు వెళ్లి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. ఇంకా మిగిలి పోయినవారు ఉంటే రెండో విడత 9, 10 తేదీలలో కూడా దరఖాస్తులు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్లపై సమావేశం నిర్వహిస్తున్న ఆర్‌వో జయరాం

ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపీడీవో



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో జాన్‌లింకన్

నర్సీపట్నం అర్బన్, ఏప్రిల్ 4 : వేములపూడి పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో జాన్‌లింకన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలు, మేట్లతో మాట్లాడారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉదయం ఐదు గంటలకే పనులకు వచ్చి, ఎండ బారిన పడకుండా పనిచేసుకోవాలని సూచించారు. అంతా విధిగా తమవెంట మంచినీళ్లు తెచ్చుకోవాలన్నారు. వడ దెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కూలీలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మేట్లకు ఆయన ఆదేశించారు.

నిరుద్యోగులకు నయవంచన

... 5వ పేజీ తరువాయి

80 శాతం మంది పోలీస్, ఉపాధ్యాయ పోస్టుల కోసం శిక్షణ పొందుతున్నారు. వీరంతా విశాఖతోపాటు కాకినాడ, అవనిగడ్డ వంటి ప్రాంతాలకు వెళ్లి శిక్షణ తీసుకుంటున్నారు. ఇందుకోసం నెలకు కనీసం రూ.8 వేలు ఖర్చవుతుంది. అయితే ఈ ఐదేళ్లలో ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకపోవడంతో వారంతా రగిలిపోతున్నారు. జగన్ సర్కారు వల్ల జీవితం నాశనమైపోయిందని, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని డీఎస్సీకి ప్రిపేరవుతున్న శివ అనే యువకుడు ఆవేదన వ్యక్తంచేశాడు. మూడేళ్లపాటు అవనిగడ్డలో శిక్షణ తీసుకున్నానని, సుమారు మూడు లక్షల రూపాయలు తల్లిదండ్రులకు అప్పు మిగిల్చానని, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఇంటికి వెళ్లాలో అర్థం కావడం లేదన్నాడు. తనలాంటి ఎంతోమంది ఉసురు వైసీపీకి తగులుతుందని శాపనార్థాలు పెట్టాడు. పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించాలన్న కల ఎప్పటికి నెరవేరుతుందో అర్థం కావడం లేదని వెంకటేష్ అనే మరో నిరుద్యోగి వాపోయాడు. ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించానని, తదుపరి దశ కోసం ఏడాది నుంచి ఎదురుచూస్తున్నానన్నాడు. నిరుద్యోగులను జగన్ ప్రభుత్వం దగా చేసిందని, ప్రభుత్వ ఉద్యోగంతో ఇంటికి వెళతామని ఆశపడ్డ తనలాంటి ఎంతోమందిని వైసీపీ సర్కారు తీవ్ర నిరాశకు గురిచేసిందని లక్ష్మీ తులసీ అనే డీఎస్సీ అభ్యర్థిని ఆవేదన వ్యక్తం చేశారు.

టీడీపీ హయాంలో భారీగా ఉద్యోగాల భర్తీ

తెలుగుదేశం పార్టీ హయాంలో 2014 నుంచి 2019 మధ్యకాలంలో భారీగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీచేశారు. పోలీస్ శాఖలో సుమారు 15 వేలకుపైగా ఖాళీలను భర్తీచేయగా, గ్రూప్-2 పోస్టుల భర్తీకి రెండుసార్లు నోటిఫికేషన్ ఇచ్చారు. 2016లో 900 పోస్టులు, 2018లో 440 పోస్టులను భర్తీచేశారు. అలాగే 2018లో 7,900 ఉపాధ్యాయ ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేసింది. ఆ తరువాత ఇప్పటివరకూ ఆయా శాఖల్లో ఒక్క కొత్త పోస్టును భర్తీచేయలేదు. కానిస్టేబుల్ నియామక ప్రక్రియ మధ్యలో ఉండగా, ఎస్ఐ పోస్టుల భర్తీ ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు. కొద్దిరోజుల కిందటే గ్రూప్-1, గ్రూప్-2 అభ్యర్థులకు రాత పరీక్షను నిర్వహించారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని హడావిడిగా నోటిఫికేషన్లు ఇవ్వడం తప్పితే...గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చుకోవాలన్న ఆలోచన ఈ ప్రభుత్వ పెద్దల్లో కనిపించ లేదని నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు. ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో నోటిఫికేషన్లు ఇచ్చి నిరుద్యోగులను మభ్యపెట్టాలని జగన్ సర్కారు చూసిందని రాజేష్ యలమల అన్నాడు. వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేందుకు నిరుద్యోగులు సిద్ధంగా ఉన్నారన్నాడు.

చీడిగుమ్మలలో నూకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ



గొలుగొండ, ఏప్రిల్ 4 : చీడిగుమ్మలలో గురువారం నూకాలమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. టీటీడీ రూ. పది లక్షల నిధులు మంజూరు చేయడంతో ఈ ఆలయ నిర్మాణాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నసమారాధన ఏర్పాటైంది. జడ్పీటీసీ సుర్ల వెంకటగిరిబాబు, ఉప సర్పంచ్ కొశిరెడ్డి సత్తిబాబు, నాయకులు ఇటంశెట్టి రామకృష్ణ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విజయ్‌పై చర్యలకు ఎమ్మెల్యే ఫిర్యాదు

నర్సీపట్నం/నాతవరం, ఏప్రిల్ 4 : ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా చింతకాయల విజయ్ వ్యవహరించారని ఆరోపిస్తూ ఎమ్మెల్యే గణేశ్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జయరాంకు ఇక్కడ ఫిర్యాదు చేశారు. నాతవరం శివారు కోటమ్మతల్లి గుడి దగ్గర ముందస్తు అనుమతి లేకుండా గురువారం పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలతో విజయ్ సమావేశం నిర్వహించారని వైసీపీ నాయకులకు తెలిసి ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులకు ఫిర్యాదు చేశార న్నారు. నియమావళిని ఉల్లంఘించినందుకు విజయ్‌పై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. ఇదిలావుంటే, ఇదే అంశంపై నాతవరం వైసీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు ఇక్కడ ఎంపీడీవో, ఎస్ఐకు ఫిర్యాదు చేశారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు

... 5వ పేజీ తరువాయి

ఎంపీడీవో ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయాన్ని నియోజకవర్గ ఆర్‌వో జయరాంకు నివేదిస్తున్నట్టు ఆయన తెలిపారు.

నర్సీపట్నంలో 65 మంది..

నర్సీపట్నం: మునిసిపాలిటీలో 65 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. గురువారం మునిసిపల్ కమిషన్ రవిబాబుకి వీరంతా రాజీనామా పత్రాలు అందజేశారు. గత రెండు రోజుల్లో 195 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారని కమిషనర్ తెలిపారు.

బి.కింతాడలో 13 మంది..

దేవరాపల్లి: మండలంలోని బి.కింతాడలో 13 మంది వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. ఈ మేరకు ఎంపీడీవో పేరిట రాజీనామా లేఖలను సచివాలయ కార్యదర్శి అప్పారావుకు అందజేశారు. గ్రామంలో రాజకీయ నాయకులు తమను సంఘ విద్రోహ శక్తులుగా చూస్తున్నారని, వారి ఒత్తిళ్లు తట్టుకోలేక రాజీనామా చేస్తున్నట్టు వలంటీర్లు కొప్పాక నాగేంద్ర, హరికృష్ణ, మోహన్, ఇందిర, చంద్రశేఖర్ తదితరులు పేర్కొన్నారు.

నాతవరం మండలంలో 182 మంది..

నాతవరం: నాతవరం మండలంలో 182 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేసినట్టు ఎంపీడీవో జె.రాంబాబు తెలిపారు. వలంటీర్లు ముకుమ్మడిగా రాజీనామా లేఖలను అందజేసినట్టు తెలిపారు.

ఎన్నికలు సజావుగా జరిగేలా...

... 5వ పేజీ తరువాయి

ప్రత్యేక అకౌంట్ నిర్వహించి రిటర్నింగ్ అధికారి లేదా వ్యయ పరిశీలకులకు రోజువారీ నివేదిక అందించాలని చెప్పారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించి అనుమతి పొందేందుకు ప్రత్యేకంగా సువిధ యాప్ ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. అభ్యర్థి పార్టీ లేదా సొంతంగా గానీ తాను సేకరించిన మొత్తం లేదా విరాళం వివరాలను జమగా చూపించాల్సి ఉంటుందన్నారు. వాహనాలు, సభలు, సమావేశాల నిర్వహణ, అన్ని విధాలా ప్రకటనలు, కమిషన్ నిర్ణయించిన రేట్లను అనుసరించే లెక్కిస్తారని చెప్పారు.

చోడవరంలో ఉద్రిక్తత

... 5వ పేజీ తరువాయి

సీఎం రమేష్ అన్నారు. జగన్ పాలనలో అక్రమాలకు ఇది నిలువెత్తు నిదర్శనమన్నారు. ఇప్పటికే వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, గ్రానైట్ వ్యాపారులను వైసీపీ నేతలు వేధింపులకు గురిచేసి రాష్ట్రం వదిలి పారిపోయే పరిస్థితి కల్పించారన్నారు. ఎన్నికల సమయంలో సైతం అధికార పార్టీ ఎమ్మెల్యే ధర్మశ్రీ మాట వినలేదన్న కోపంతో వ్యాపారిపై అధికారులను ఉసిగొల్పడం దారుణమన్నారు. అధికార పార్టీ నేతలకు మరో 40 రోజులే ఉందని, ఆ తరువాత వారి తప్పిదాలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఈర్లె శ్రీరామమూర్తి, టీడీపీ నాయకులు మత్స్యరాజు, సకురు కోటేశ్వరరావు, జనసేన నాయకులు గూనూరు మూలినాయుడు, కర్రి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మాట వినలేదనే ధర్మశ్రీ మాపై కక్ష కట్టారు

తన మాట వినలేదన్న కక్షతోనే కరణం ధర్మశ్రీ దాడులు చేయించారని టైల్స్ దుకాణం యజమాని బుచ్చిబాబు ఆరోపించారు. తన దుకాణం నుంచి టైల్స్ తీసుకుని డబ్బులు ఇవ్వలేదు సరికదా...లక్షలాది రూపాయలు అడుగుతున్నారని ఆరోపించారు. బుచ్చిబాబు కుమార్తెలు కూడా ఈ సందర్భంగా ధర్మశ్రీపై తీవ్రస్థాయిలో అవినీతి ఆరోపణలు చేశారు.

\- దుకాణం యజమాని

చోడవరం నియోజకవర్గం

ఘనంగా నూకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

చోడవరం, ఏప్రిల్ 4 : మండలంలోని వెంకన్నపాలెంలో నూకాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ గురువారం ఘనంగా నిర్వహించారు. భవిరిశెట్టి కోటేశ్వరరావు, రత్నావతి దంపతుల సహకారంతో చేపట్టిన ఆలయ నిర్మాణం పూర్తయిన సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. సర్పంచ్ మొల్లి ఈశ్వరరావు ఏర్పాట్లు చేశారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 4 : ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని ఎస్ఐ డి. ఈశ్వరరావు కోరారు. గురువారం స్థానిక పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలతో కలిసి వడ్డాది, దిబ్బిడి, బుచ్చెయ్యపేట, రాజాం, విజయరామరాజుపేట, నీలకంఠాపురం, ఆర్. శివరామపురం, మల్లాం, పోలేపల్లి, కోమళ్లపూడి గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు భద్రత, భరోసా కల్పించడానికి కవాతు నిర్వహించామన్నారు.

గ్లూకోజ్, మజ్జిగ పంపిణీ

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 4 : పోలేపల్లిలో పింఛన్‌దారులకు ఎమ్మెల్యే ధర్మశ్రీ, మజ్జిగ, గ్లూకోజ్ ప్యాకెట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కావడంతో వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయనతో పాటు జడ్పీటీసీ సభ్యుడు రాంబాబు, సర్పంచ్ విజయకుమార్ ఉన్నారు.

పార్టీ మారిన వారంతా టీడీపీ వాళ్లే

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 4 : టీడీపీలో చేరిన వారంతా గతంలో ఆ పార్టీ నుంచి వైసీపీలోకి వచ్చిన వారేనని ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, కాంగ్రెస్ కిసాన్ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొల్లిమళ్ల అచ్చెంనాయుడు అన్నారు. గురువారం వారు కేపీ అగ్రహారంలో విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికల్లో వారంతా టీడీపీ అభ్యర్థి గెలుపునకు పనిచేశారని, ఎన్నికల య్యాక వైసీపీలో చేరి అధికారం అనుభవించి, మళ్లీ ఎన్నికల ముందు టీడీపీలోకి వెళ్లిపోయారన్నారు.

కోనాంలో చలివేంద్రం

చీడికాడ, ఏప్రిల్ 4 : కోనాం సచివాలయం వద్ద గురువారం నుంచి చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి సన్యాసిరావు మాట్లాడుతూ ఏజెన్సీల నుంచి వచ్చే వారి కోసం చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు.

పెన్షన్ల కోసం పడిగాపులు

- వైసీపీ నిర్వాకం వల్ల సచివాలయాల వద్ద వృద్ధుల అవస్థలు
- సుదూర ప్రాంతాల నుంచి రాక

చీడికాడ, ఏప్రిల్ 4 : వైసీపీ నిర్వాకం వల్ల పింఛన్‌దారులు ఇబ్బందులకు గురవుతున్నారు. పింఛన్ తీసుకోవడానికి కిలోమీటర్ల దూరం నుంచి నడుచుకుంటూ సచివాలయాలకు వస్తున్నారు. కోనాంలో అధికారులు గురువారం పింఛన్లు పంపిణీ చేశారు. పంచాయతీ కేంద్రంతో పాటు మరో 13 శివారు గ్రామాలు ఉన్నాయి. రెండు నుంచి పది కిలోమీటర్ల లోపల కోనాంకి దూరంలో ఉన్న గ్రామాలు కూడా న్నాయి. సచివాలయంలో పింఛన్ ఇస్తున్నామని అధికారులు సమాచారం ఇవ్వడంతో ఆటో సదుపాయం లేని రెల్లలపాలెం, చెరకుపల్లి, గొడుగుమామిడి, జాజులపాలెం వంటి గిరిజన గ్రామాలకు చెందిన పలువురు కోనాం సచివాలయానికి మండుటెండలో తరలి వచ్చారు. ఎన్నికలు పూర్తయ్యే వరకూ ఇలానే పంపిణీ చేయడం సరికాదని పేర్కొన్నారు. కాగా కోనాం పంచాయతీలో 862 మంది గాను 692 మందికి పింఛన్ ఇచ్చినట్టు పంచా యతీ కార్యదర్శి సన్యాసిరావు తెలిపారు.



కోనాం సచివాలయానికి పింఛన్ కోసం వచ్చిన వృద్ధులు

పట్టణంలో జోరుగా పింఛన్ల పంపిణీ

చోడవరం : పట్టణంలో సామాజిక పింఛన్ల పంపిణీ చురుగ్గా సాగుతోంది. మండలంలోని ఐదు సచివాలయాల పరిధిలో 30 మంది సిబ్బంది పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. పట్టణంలో 3117 పింఛన్లకు గాను గురువారంసాయంత్రానికి 2180 మందికి అందజేశారు. శుక్రవారం సాయంత్రానికి పంపిణీ ప్రక్రియ పూర్తవుతుందని స్థానిక పంచాయతీ ఈవో నారాయణరావు తెలిపారు. పింఛనుదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా టెంట్ ఏర్పాటు చేసి, తాగునీటి సౌక ర్యం కల్పించారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనలో నిర్లక్ష్యం

రోలుగుంట, ఏప్రిల్ 4 : పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని ఉన్నతాధికారులు పదే పదే ఆదేశిస్తున్నా.. సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండడంతో తహసీల్దార్ రవిచంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన కె. నాయుడుపాలెంలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలో కనీస సదుపాయాలతో పాటు దివ్యాంగుల కోసం ర్యాంపులు లేకపోవడంతో కార్యదర్శి శివపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే మౌలిక వసతులు కల్పించాలని, నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆయన నిండుగొండ, ఎన్. కొత్తూరు, కొవ్వూరు సచివాలయాలను సందర్శించారు. ఆయనతో పాటు డీటీ సోమశేఖర్ ఉన్నారు.

47 మందికి నేత్ర వైద్య పరీక్షలు

దేవరాపల్లి, ఏప్రిల్ 4 : మండల కేంద్రంలోని ఉషోదయ స్కూల్ వద్ద శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 47 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు.

మౌనానికి కారణమేంటో?

... 5వ పేజీ తరువాయి

పెడుతున్నారా? అని నియోజకవర్గంలో చర్చ సాగుతోంది. జమీలుగా పిలుచుకునే సన్యాసిపాత్రుడు 2019 అసెంబ్లీ ఎన్నికల తరువాత టీడీపీని వీడి వైసీపీలో చేరారు. సీఎం జగన్... చింతకాయల సన్యాసిపాత్రుడు భార్య అనితకు డీసీసీబీ చైర్‌పర్సన్‌గా అవకాశం ఇచ్చారు. డీసీసీబీ పదవి వచ్చిన తరువాత ఎమ్మెల్యేకు, సన్యాసిపాత్రుడు మధ్య దూరం పెరిగింది. సన్యాసిపాత్రుడు రెండో ప్రత్యామ్నాయంగా మారతారని ఉద్దేశంతోనే ఎమ్మెల్యే మునిసిపాలిటీలోని కార్యక్రమాలకు మాత్రమే పరిమితం చేశారని అనుకుంటున్నారు. మెయిన్ రోడ్డు విస్తరణ విషయంలో జమీలు తల దూర్చి భవన యజమానులకు మద్దతుగా విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, సీఎం వరకు తీసుకు వెళ్లారని ఎమ్మెల్యే గణేశ్ మనస్సులో పెట్టుకున్నారని, ఈ విషయంలో ఇద్దరి మధ్య దూరం పెరిగిందని అంటున్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కూడా జమీలు ఎన్నికల ప్రచారంలో కనిపించడం లేదు. ఎమ్మెల్యే ఒక్కరే మండలాల్లో ఎన్నిక ప్రచారం చేస్తున్నారు. ఈ విధంగా వైసీపీ, టీడీపీలోని ఇద్దరు కీలక నేతలు ప్రచారంతో పాల్గొనకపోవడంతో నియోజకవర్గంలో చర్చకు దారి తీసింది.



భవన నిర్మాణ కార్మికులతో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే రాజు

భవన నిర్మాణ కార్మికులతో మాజీ ఎమ్మెల్యే సమావేశం

రావికమతం, ఏప్రిల్ 4 : టీడీపీ అధికారంలోకి వస్తే భవన నిర్మాణ రంగానికి పూర్వ వైభవం తీసుకువస్తామని చోడవరం టీడీపీ అభ్యర్థి కేఎస్ఎన్ రాజు అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని కనక దుర్గా భవన నిర్మాణ కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణ కార్మికులకు చేతి నిండా పని ఉండేదని, వైసీపీ అధికారంలోకి వచ్చాక ఇసుకపై ఆంక్షలతో నిర్మాణ రంగం కుదేలైందని చెప్పారు. సమావే శంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు పోలరాతి అప్పారావు, రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, రావికమతం ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు, ఎంపీటీసీ సభ్యుడు గంజి సూర్యనారాయణ, తెలుగుయువత అధ్యక్షుడు నాగేశ్వరరావు, వేపాడ నాగేశ్వరావు, గంజి రమణ, పులగాయాల సత్యనారాయణ, కొశిరెడ్డి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

నామమాత్రంగా మండల సర్వసభ్య సమావేశం

రోలుగుంట, ఏప్రిల్ 4 : మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం జరిగింది. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో కొన్ని శాఖల అధికారులు, కొంతమంది ఎంపీటీసీలు హాజరై మమ అనిపించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్, ఉపాధి హామీ పథకం, హౌసింగ్, విద్యాశాఖ అధికారులు మాత్రమే హాజరై తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఏఈ వెంకటరాజు తెలిపారు.

మాడుగుల నియోజకవర్గం

నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దేవరాపల్లి, ఏప్రిల్ 4 : మండలంలోని తామరబ్బ పంచాయతీ శివారు కొండకొడాబు పెద్దగరువులో అధికారులు నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. ఇక్కడి పొలంలో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉండడంతో గత నెల 30న 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన ఏఈఈ శంకరరావు గురువారం శిథిలమైన స్తంభాలను తొలగించి, కొత్త స్తంభాలు వేయించారు. అలాగే ఆ ప్రాంతంలో ప్రమాదకరంగా ఉన్న వైర్లను మార్చారు. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబు పాలనతోనే రాష్ట్రాభివృద్ధి : మాడుగుల అభ్యర్థి పైలా

మాడుగుల/మాడుగుల రూరల్, ఏప్రిల్ 4 : చంద్రబాబునాయుడు పాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్య మని టీడీపీ అభ్యర్థి పైలా ప్రసాదరావు అన్నారు. గురువారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురవేయడం ఖాయమని చెప్పారు. సమావేశంలో అనకాపల్లి ఎంపీ అభ్యర్థి రమేష్ సోదరుడు సురేష్, నాయకులు జగ్గారావు, దేముడు, అప్పలరాజు జనసేన, బీజేపీ నాయకులు గంగయ్య, కృష్ణ, రొబ్బా మహేష్, ఇళ్లపు రమేష్, దర్శిశెట్టి అప్పారావు పాల్గొన్నారు.



మామిడిపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న పైలా ప్రసాదరావు

మామిడిపల్లిలో ప్రజాగళం

దేవరాపల్లి : మామిడిపల్లిలో టీడీపీ అభ్యర్థి పైలా ప్రజాగళం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పోతల పాత్రునాయుడు, చెరకాన సూర్యనారాయణ, రామారావు, అర్జునరావు, గాలిరవికుమార్, బలరాం, రాజినాయుడు పాల్గొన్నారు.

కె. కోటపాడులో మాక్ పోలింగ్

కె. కోటపాడు, ఏప్రిల్ 4 : ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం స్థానిక అయ్యన్న ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ కూనిరెడ్డి సత్యనారాయణ-1, ప్రసాద్-2 మాట్లాడుతూ ఓటర్లు, ఎన్నికల అధికారులు పోలీసులు, ఏజెంట్ల, వాటి గురించి విద్యార్థులకు అన్నారు.

